ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
సోమవారం 10 మార్చి 2025

మున్సిపాలిటీల ఎన్నో ఏళ్ల కల కూటమి ప్రభుత్వంతో సాకారమయ్యింది. పురపాలకశాఖ మంత్రి నారాయణ కృషితో రాష్ట్రంలోని నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాలకు ఆర్థిక స్వాతంత్ర్యం లభించింది. ఇకపై చెత్త తొలగించాలన్నా, నీటి కుళాయి రిపేరు చేయాలన్నా, వీధి లైటు వేయాలన్నా, రోడ్లపై గుంతలు పూడ్చాలన్నా...! నిధుల కోసం రాష్ట్ర ప్రభుత్వం వైపు చూసే దయనీయ పరిస్థితి తప్పింది. బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్ వేగవంతంగా జరగడమే కాకుండా కట్టడాల కట్లు తప్పకుండా కళ్లెం వేసే కొత్త చట్టం కూడా అమలులోకి వచ్చింది. నారాయణ సుదీర్ఘకాల విన్నపానికి కూటమి ప్రభుత్వం పచ్చజెండా ఊపడంతో భవిష్యత్తులో మున్సిపాలిటీలకు ఆర్థిక కష్టాలు తీరనున్నాయి. మున్సిపాలిటీలు తమ ఆదాయాన్ని తమ అవసరాలకు నేరుగా ఖర్చు చేసుకునే అవకాశం లభించింది.



మున్సిపాలిటీలకు

ఆర్థిక స్వేచ్ఛ!

- స్థానిక సంస్థల నిధులు ఇక వాటివద్దే..!
- అవసరాలకు ఖర్చు చేసుకునే అధికారమూ దఖలు
- భవన నిర్మాణ అనుమతులూ వాటికే..
- మంత్రి నారాయణ కృషితో ప్రభుత్వ నిర్ణయం

నెల్లూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత పదేళ్లగా మున్సిపాలిటీల ఆదాయంలో ప్రతిపైసా సీజేఎఫ్ఎస్‌లో జమచేస్తున్నారు. స్థానిక అవసరాలకు నిధులు రాబట్టుకోవడం అనేది సీజేఎఫ్ఎస్ దయాదాక్షిణ్యాలపై ఆధారపడి ఉండేది. ఈ క్రమంలో మున్సిపాలిటీ ఆదాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఇతర అవసరాలకు వాడుకొని ఎప్పుడో బుద్ధిపుట్టినప్పుడు మున్సిపాలిటీలకు బదిలీ చేసేది. తమ అవసరాల కోసం ఖర్చు చేసుకున్న నిధులను తమ ఆదాయం నుంచి విడుదల చేయాలని మున్సిపాలిటీలు రెండేళ్ల క్రితం పెట్టుకున్న బిల్లులకు కూడా ఇప్పటి వరకు మోక్షం లేదంటే నిధుల విడుదల ఎంత ఘోరంగా ఉండేదో, మున్సిపాలిటీలు ఎంత ఆర్థిక సంక్షోభాన్ని అనుభవించేవో అర్థం అవుతుంది. 2014-19లో మున్సిపల్ శాఖ మంత్రిగా పనిచేసిన పొంగూరు నారాయణ ఈ పద్ధతిని మార్చేందుకు ప్రయత్నించారు. మున్సిపాలిటీలకు ఎన్నో అవసరాలు ఉంటాయి, వారి నిధులు వారివద్దే ఉంచాలనే ప్రతిపాదనను ప్రభుత్వం ముందుకు బలంగా తీసుకొచ్చారు. అయితే అప్పటికే ఎన్నికల సమయం దగ్గరపడటంతో ఈ ప్రతిపాదనలు మూలనపడ్డాయి. దీంతో గత ఐదేళ్ల పాత పద్ధతే కొన సాగింది. పన్నుల రూపంలో వచ్చిన మున్సిపాలిటీల ఆదాయాన్ని వైసీపీ ప్రభుత్వం ఇతర అవసరాలకు వాడుకోవడంతో గడచిన ఐదేళ్లు పురపాలికలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొన్నాయి. మున్సిపాలిటీలలో పనులు చేస్తే బిల్లులు ఎప్పటికి వస్తాయో గ్యారెంటీ లేకపోవడంతో టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు వచ్చేవారు కారు. ఈ కారణంగానే జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో గత ఐదేళ్ల కాలంలో రోడ్లపై ఏర్పడిన గుంతలను కూడా పూడ్చలేకపోయారు.

అసెంబ్లీ ఆమోదంతో...

ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, మళ్లీ మున్సిపల్ శాఖ మంత్రిగా నారాయణ బాధ్యతలు చేపట్టడంతో ఆయన పాత ప్రతిపాదనను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. మున్సిపాలిటీలు బాగుపడాలంటే వాటికి ఆర్థిక స్వాతంత్ర్యం అవసరం అని, వాటి ఆదాయాన్ని వాటి వద్దే ఉంచాలని ఆయన కూటమి ప్రభుత్వ పెద్దలను ఒప్పించగలిగారు. దీంతో మున్సిపాలిటీలకు ఆర్థిక స్వాతంత్ర్యం బిల్లు అసెంబ్లీలో ఆమోదం పొందింది. మున్సిపాలిటీలకు ఈ ఆర్థిక సంవత్సరం నుంచి పన్నుల రూపంలో వచ్చే ఆదాయం స్థానిక సంస్థల వద్దే ఉంటుంది. అవసరాలకు ఖర్చు చేసుకునే అధికారం వారికి ఉంటుంది.

ప్లాన్ అప్రూవల్ సరళతరం


ఈ కొత్త బిల్లులో బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్‌ను కూడా సరళతరం చేయడంతోపాటు ఉల్లంఘనలు జరిగితే చర్యలు తీసుకోవడానికి వీలుగా చట్టం చేశారు. ఇప్పటి వరకు మున్సిపాలిటీల్లో బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్ కోసం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి పంపేవారు. ఇప్పుడు దానిని రద్దు చేశారు. మున్సిపాలిటీలే నేరుగా అప్రూవల్ ఇచ్చే వెసులుబాటు కల్పించారు. దీనివల్ల అప్రూవల్స్ వేగవంతం అవుతాయి. అలాగే ప్లాన్ ఉల్లంఘించి నిర్మాణాలు జరిగితే వాటిని కూల్చే అధికారం కూడా మున్సిపాలిటీలకు ఇచ్చారు. అందుకు అంగీకరిస్తూ భవన యజమాని అఫిడవిట్ ఇవ్వాల్సి ఉంటుంది. దీనివల్ల నిర్మాణాల్లో ఉల్లంఘనలు చాలా వరకు కట్టడి కానున్నాయి.

రంగడి బ్రహ్మోత్సవాలకు

వైభవంగా అంకురార్పణ



అంకురార్పణ పూజలు చేస్తున్న అర్చకులు



ప్రత్యేక అలంకరణలో రంగనాథస్వామి

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 9 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని తల్పగిరి రంగ నాథస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం రాత్రి వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అంకురార్పణ పూజలు, పుణ్యాహవచనం, విష్వక్సేనారాధన, మృత్సంగ్రహణం, స్వామివారి ఉత్సవ మూర్తులకు రక్షా బంధనం, సోమ కుంభ ప్రతిష్ఠ, గరుడ ధ్వజ పతిష్ఠ, హోమాలు జరిగాయి. భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో ఉభయకర్త ఆనం గోపాల కృష్ణారెడ్డి, కుటుంబ సభ్యులు, ఈవో ఆళ్ల శ్రీనివాసరెడ్డి, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రసన్న వేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాలు

ఘనంగా ప్రారంభం

- గిరిప్రదక్షిణకు భారీగా తరలివచ్చిన భక్తులు
- దేవతామూర్తుల వేషధారణలు, కోలాటాలు, భజనలతో సందడి



ఆలయం నుంచి గిరిప్రదక్షిణకు బయలుదేరి స్వామిఅమ్మవార్లు

బిట్రగుంట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కొండ బిట్రగుంట బిలకూట క్షేత్రంపై వెలసి ఉన్న శ్రీప్రసన్న వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం గిరిప్రదక్షిణ వైభవంగా జరిగింది. ఆలయంలోని ప్రధాన అలంకార మండపంలో గిరిప్రదక్షిణకు ముస్తాబైన స్వామి, అమ్మవార్లను భక్తులు దర్శించుకుని, ఆనంద పరవసులయ్యారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం స్వామివారు ఉత్తరద్వారం నుంచి దిగువ మండపానికి చేరు కున్నాక అర్చకులు సత్యానారాయణచార్యులు మంగళహారతులు అందచేశారు. గోద ర్శనం అనంతరం గిరిప్రదక్షిణ ప్రారంభ మైంది. ఈ కార్యక్రమంలో చిన్నా రుల దేవతామూర్తుల వేషధారణ, భరత నాట్యం, కోలాట నృత్యాలు, భజనలు భక్తులను అలరించాయి. కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి దంప తులు, ఆర్డీవో వంశీకృష్ణ తదితరులు ఈ సందర్భంగా కోలాటం ఆడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు రాజకుమార్, నాగేశ్వ రావు, కావలి ఏఎంసీ మాజీ చైర్మన్ దేవరాల సుబ్రహ్మణ్యం దంపతులు, బీజేపీ నేత భరత్‌కుమార్ యాదవ్, ఎన్ఎస్‌యాదవ్ దంపతులు పాల్గొన్నారు. సాయంత్రం భూమి పూజచేసి, పుట్టమట్టిని తీసుకుని వచ్చి అంకురార్పణను శాస్త్రోక్తంగా నిర్వహిం చారు. ఈ కార్యక్రమాలకు ఉభయ కర్తలుగా దాట్ల సుదర్శన్‌రెడ్డి, గుడ్లదొన వరప్రసాద్, డబ్బుగుంట వెంకటేశ్వర్లు, అరికట్ల ఉమాచంద్ తదితరులు వ్యవహరించారు.

విధేయతకు పట్టం

- ఎమ్మెల్సీగా బీద రవిచంద్రకు అవకాశం
- మొదటి నుంచి టీడీపీలోనే..
- రాజకీయ చాణిక్యుడిగా గుర్తింపు
- ప్రతిపక్షంలోనూ సీమ ఇన్‌చార్జిగా కీలక బాధ్యతలు
- నేడు నామినేషన్ దాఖలు
- ఎన్నిక లాంఛనమే..

నెల్లూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కష్టపడ్డవారికి ఎప్పటికైనా గుర్తింపు ఉంటుందని టీడీపీ మరోసారి రుజువు చేసింది. నిబద్ధత, విధేయతకు మారుపేరైన బీద రవిచంద్రకు పార్టీ మరోసారి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించింది. ఎమ్మెల్యే కోటాలో ఖాళీ అయిన ఎమ్మెల్సీ స్థానాలకు అభ్యర్థులను టీడీపీ ఆదివారం ప్రకటించింది. అందులో బీదకు అవకాశమిచ్చారు. సోమవారం నామినేషన్ వేయనున్నారు.

రెండోసారి అవకాశం

ప్రస్తుతం కూటమికి మెజారిటీ ఎమ్మెల్యేలు ఉండడంతో బీద ఏకగ్రీవంగా ఎన్నిక కానున్నారు. రవిచంద్ర శాసనమండలికి ఎన్నిక కావడం ఇది రెండోసారి. 2017లో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో రవిచంద్రకు ఎమ్మెల్సీగా అవకాశమిచ్చారు. అప్పట్లో ఆయన జిల్లా పార్టీ అధ్యక్షుడిగా ఉన్నారు. అయితే 2019లో అధికారం కోల్పోయాక రవిచంద్ర సేవలను రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ వినియోగించుకుంది. 1992 నుంచి ప్రత్యక్ష రాజకీయాల్లో ఉన్న రవిచంద్ర.. అల్లూరు మండల తెలుగు యువత కార్యదర్శి నుంచి జాతీయ ప్రధాన కార్యదర్శి స్థాయికి అంచలంచెలుగా ఎదిగారు. గ్రామ స్థాయి రాజకీయాలు బాగా తెలిసిన ఆయన రాష్ట్ర స్థాయిలో టీడీపీ బలోపేతానికి విశేషంగా కృషి చేశారు. రాజకీయ చాణిక్యుడిగా బీదకు పేరుంది. గత ఐదేళ్ల ప్రతిపక్షంలో ఉన్న ప్పుడు రాయలసీమ ఇన్‌చార్జిగా వ్యవహరిం చారు. రాయలసీమలోని అన్ని జిల్లాల్లో విస్తృతంగా పర్యటించారు. ప్రతి నియోజక వర్గంపై లోతుగా సమీక్షించడం, అక్కడ పరిస్థితు లను చక్కదిద్దడం లో సఫలీకృతు లయ్యారు. గతేడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థుల ఎంపిక లోనూ కీలకంగా వ్యవ హరించారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రాయలసీమ జిల్లాల్లో అత్య.ధిక సీట్లు టీడీపీ సాధించడంలో కీలకపాత్ర పోషించారు. ఒకదశలో కావలి నుంచి పోటీ చేయాలన్న ఆలోచన కూడా చేశారన్న ప్రచారముంది. అయితే అధినేత ఆదేశాల మేరకు పార్టీ బలోపేతానికే రవిచంద్ర మొగ్గు చూపారు. రాష్ట్ర స్థాయిలో కీలక బాధ్యతలు నిర్వహించినా, జిల్లాలోని పరిస్థితులను తెరవెనుక నుంచి ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ వచ్చారు. వైసీపీ ప్రభుత్వం నీరు-చెట్టు బిల్లులను ఆపేసి టీడీపీ కార్యకర్తలను ఇబ్బం దులకు గురి చేసిన సమయంలో.. హైకోర్టు ద్వారా బిల్లులు తెచ్చుకోవ డంలో కీలకంగా వ్యవహరించారు.



బీద రవిచంద్రకు ఎమ్మెల్సీ సీటు ప్రకటించడంతో ఆదివారం విజయవాడలోని ఓ హోటల్‌లో ఆయన్ను సన్మానించిన అభిమానులు

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సోమవారం) : 6.23
సహరి (మంగళవారం) : 5.04

పేరు : బీద రవిచంద్ర
తల్లిదండ్రులు : జయలక్ష్మి, రఘరామయ్య
జన్మస్థలం : ఇస్కపల్లి, అల్లూరు మండలం
విద్యార్హతలు : ఎం,కామ్,.

రాజకీయ నేపథ్యం : అల్లూరు మండల తెలుగు యువత కార్యదర్శిగా (1992-1993), జిల్లా తెలుగు యువత కార్యదర్శిగా (1993-95), అల్లూరు మండల పార్టీ అధ్యక్షుడిగా(1995-2000), అల్లూరు నియోజకవర్గం సమన్వయకర్తగా(1998-2000), జిల్లా ప్రధాన కార్యదర్శిగా (2000-2010), రాష్ట్ర పార్టీ సహాయక కార్యదర్శిగా (2007-2008), కడప జిల్లా ఇన్‌చార్జిగా(2008), తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడిగా (2008-2014), జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా (2012-2020), ఎమ్మెల్సీగా (2017-2023) పనిచేశారు.

చారిత్రక ఘట్టం ఆవిష్కరణ

- నెల్లూరు రూరల్‌లో ఒకేరోజు 105 ప్రాంతాల్లో పనుల ప్రారంభం
- ప్రజలతో శంకుస్థాపన చేయించిన ఎమ్మెల్యే కోటంరెడ్డి
- మంత్రి నారా లోకేష్ ప్రశంసలు

నెల్లూరురూరల్, మార్చి9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆదివారం ఓ చారిత్రకఘట్టం ఆవిష్కృతమైంది. రాష్ట్రంలో ఇప్పటివరకు ఎక్కడా జరగని విధంగా నూతన రాజకీయ అధ్యాయానికి రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. తన నియోజకవర్గంలోని 26 మున్సిపల్ డివిజన్ల పరిధిలోని 105 ప్రాంతాల్లో ఒకేరోజు రూ. 9.50 కోట్ల విలువ చేసే అభివృద్ధి పనులకు ఆయన ప్రజలతో శంకుస్థాపన చేయించారు. కొన్ని ప్రాంతాల్లో ఎమ్మెల్యే పాల్గొనగా, మరికొన్ని చోట్ల టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, మాజీ మేయర్ భానుశ్రీ, సీనియర్ నాయకులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

ప్రజల రుణం తీర్చుకునే అవకాశం

ఈ సందర్భంగా రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి మాట్లా డుతూ తనకు రాజకీయ జన్మనిచ్చిన నెల్లూరు రూరల్ నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకునేందుకు ఇదో సదావ కాశమన్నారు. ఆదివారం జరిగిన 105 పనుల శంకు స్థాపనతో పాటు ఈనెల 14వ తేదీలోగా మరో 198 ప్రాంతాల్లో శంకుస్థాపనలు చేయనున్నట్లు వివరించారు. ఇందుకుగాను రూ. 40 కోట్లు ఖర్చు చేయనున్నామన్నారు. ఈ మొత్తం పనులను మే 20వ తేదీలోగా పూర్తి చేసి, కార్యకర్తలతోనే ప్రారంభోత్సవాలు చేయిస్తామని చెప్పారు. సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం కొలువుతీరాక ఇప్పటి వరకు తన నియోజకవర్గంలోరూ. 191 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. పొట్టేపాళెం, ములుముడి ప్రాంతాల్లోని కలుజులపై వంతె నలు, వెల్లంటిలో కల్యాణ మండపం పూర్తి చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నానని ఆయన స్పష్టం చేశారు.

మంత్రి లోకేష్ ప్రశంసలు

నెల్లూరు రూరల్‌లో ఒకేరోజు 105 పనులకు శంకుస్థాపన చేయడంపై రాష్ట్ర ఐటీ శాఖమంత్రి నారా లోకేష్ ఎక్స్ వేదికగా స్పందించారు. ఇలాంటి వినూత్న కార్య క్రమం దేశ, రాష్ట్ర రాజకీయ చరిత్రలో ఇదే ప్రథమం అని పేర్కొన్నారు. ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, ఆయన సోదరుడు గిరిధర్‌రెడ్డిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని తెలిపారు.



నగరంలోని ఆకుతోట హరిజనవాడలో సిమెంట్‌రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి

జయహో.. భారత్ !

- న్యూజిలాండ్‌పై థ్రిల్లింగ్ విక్టరీ
- సంబరాల్లో మునిగితేలిన యువత
- వీధుల్లో కేరింతలు.. స్వీట్లు పంపిణీ

నెల్లూరు(విద్య), మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఐసీసీ చాంపియన్‌షిప్ ఫైనల్ మ్యాచ్‌లో భారత్ గెలుపు అందరిలోనూ సంతోషం నిలిపింది. కెప్టెన్ రోహిత్ శర్మ బ్యాట్‌తో సత్తా చాటిన వేళ...బౌలర్లు ప్రత్యర్థిని 251 పరుగలకే కట్టడి చేసిన వేళ...భారత జట్టు మరోసారి ఐసీసీ ట్రోఫీని ఖాతాలో వేసుకుంది. ఆదివారం దుబాయ్ వేదికగా జరిగిన ఫైనల్స్‌లో న్యూజిలాండ్‌ను ఓడించి భారత్ చాంపియన్‌గా అవతరించింది.

ఒకటే ఉత్కంఠ

జిల్లాలో క్రికెట్ ఫీవర్ కారణంగా యువత, ప్రజల్లో ఒకటే ఉత్కంఠ. దీంతో ఆదివారం అందరూ టీవీలకు అతుక్కుపోయారు. భారత్ క్రీడాకారుల విన్యాసాలు చూసేందుకు అంతా ప్రత్యేక ఏర్పాట్లు చేసుకున్నారు. క్రీడాకారులు కొట్టే షాట్‌లు...తీసే ప్రతి వికెట్‌కు సహచర మిత్రులతో కలసి కేరింతలు కొడితేనే మాకు ఉత్సాహం అంటూ.. యువత మజా చేసుకున్నారు. ఈ మ్యాచ్‌ను సాదాసీదాగా ఎంజాయ్ చేస్తే థ్రిల్ ఏముందంటూ హోటల్ గదులను బుక్ చేసుకున్నారు. మరి కొందరు ముందుగానే రెస్టారెంట్‌లు, బార్‌లను బుక్ చేసుకున్నారు. విద్యుత్ అంతరాయం కలగకుండా జనరేటర్లు, ఇన్వర్టర్‌లను సైతం సిద్ధం చేసుకున్నారు. దీంతో ఆదివారం రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. కొందరైతే రోడ్లపై టీవీ షోరూంల బయట నిలబడి మరీ మ్యాచ్‌ను తిలకించారు. రోహిత్‌సేనకు అభినందనలు తెలుపుతూ జిల్లా ప్రజలంతా సంబరాల్లో మునిగిపో యారు. యువత బైక్‌లపై విన్యాసాలు చేస్తూ జయహో భారత్.. అంటూ నగర వీధుల్లో నినా దాలు చేస్తూ తిరిగారు. భారత్ మాతాకీ జై ... అంటూ స్వీట్లు పంచుకున్నారు. దీంతో నెల్లూరు నగర మంతా సందడిగా మారింది. ప్రజలు, పోలీసులు కూడా అభిమానుల ఆనందానికి అడ్డంకులు తెలప కుండా వారు కూడా ఆనందాన్ని ఆస్వాదించారు.



భారీగా బెట్టింగ్‌లు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట)/లింగసముద్రం, (ఆంధ్రజ్యోతి): చాంపియన్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్‌లో భారత్-న్యూజీల్యాండ్ తలపడడంతో బెట్టింగ్ రాయుళ్లు యాప్‌ల్లో బాల్‌బాల్‌కు పందేలు కాశారు. రూ. వేల నుంచి రూ.లక్షల్లో పందేలు పెట్టారు. నెల్లూరు నగరంలో పందేల జోరు బాగా కనిపించింది. కాగా లింగసముద్రం మండలంలో కూడా క్రికెట్ బెట్టింగులు జోరుగా సాగాయి. ఇండియా గెలుస్తుందంటూ ఒకటికి రెండు వంతులు ఇచ్చేలాగున పందేలు కాశారు. అలాగే సిక్సర్లు, ఫోర్లపై కూడా పందేలు పెట్టారు. ఇటీవల లింగసముద్రం గ్రామానికి చెందిన ఓ యువకుడు క్రికెట్ బెట్టింగులో డబ్బులు పోగొట్టుకొని నెల్లూరులో ఆత్మహత్య చేసుకున్నట్టు తెలిసింది.అలాగే మరో యువకుడు ఒక వ్యాపారికి చెందిన రూ.5 లక్షలు క్రికెట్ బెట్టింగులో పోగొట్టడంతో వారు ఆ యువకుడిని స్వంత ఊరికి తీసుకెళ్లినట్టు తెలిసింది. ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌లు జరుగుతుండడంతో పోలీసులు కూడా ఏమీ చేయలేక పోతున్నారు.

న్యూస్ బాక్స్

ఫుడ్‌కోర్టు ప్రారంభం

ఉలవపాడు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని వైఎస్ రాజశేఖర్ విగ్రహం వెనుక నూతనంగా ఏర్పాటు చేసిన ఫుడ్‌కోర్టు, టీ స్టాల్‌ను ఆదివారం కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు ప్రారంభించారు. మండల ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు ఎస్‌కే ఏజెస్ ఆహ్వానం మేరకు కార్యక్రమంలో పాల్గొన్నారు. టీడీపీ మండలాధ్యక్షుడు రాచగల్లు సుబ్బారావు, సారాయిబాబు, కరీం, ఖాదర్‌భాషా, దాసరి వెంకట్రావు, ఎంపీటీసీ యలమంద మ్మ, బెల్లం కృష్ణమోహన్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దాతృత్వం

కావలి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మనుబోలు వద్ద జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనంపై వెళ్లుతున్న ఒక వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొని వెళ్లింది. ఈ సమయంలో కావలి నుంచి రేణిగుంట ఎయిర్‌పోర్ట్‌కు కారులో వెళుతున్న ఎమ్మెల్యేకు ఆయన్ను చూసి వెంటనే స్పందించాడు. వాహనం నిలిపి అపస్మారక స్థితిలో ఉన్న ఆయనకు సపర్యలు చేసి 108 వాహనంకు ఫోన్ చేయించి చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఎమ్మెల్యే మానవత్వంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

హిందూ ధర్మాన్ని ఆచరిద్దాం

కలిగిరి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరస్వామి రచించిన వంద ఆధ్యాత్మిక రచనలను త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి దుత్తలూరు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో పంపిణీ చేశారు. హిందూ ధర్మాన్ని పాటిస్తూ ప్రతి పండుగ విశిష్టతను తెలుసు కొని నిర్వహించుకోవాలని కోరారు. కార్యక్ర మంలో కమిటీ సభ్యులు ప్రసాద్,వెంకటే శ్వర్లు, సుధాకర్, పెంచలరత్నం, నరసింహులు, మహేంద్ర, ఓబులమ్మ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ కోలుకోలేక వ్యక్తి మృతి

అల్లూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్సపొందుతూ కోలుకోలేక మృతిచెందిన సంఘటన పట్టణ పరిధిలోని గాంధీకాలనీలో చోటు చేసుకుంది. ఈ నెల 2న అల్లూరు నుండి ద్విచక్ర వాహనంపై చల్లా శంకరయ్య (50), మల్లి హరీష్, బెల్లంకొండ నరేష్‌లతో కలసి దగదర్తి మండలం ఉలవపాళ్ళకు వెళ్తున్న క్రమంలో అదుపుతప్పి అల్లూరు సింగపేట మధ్యలో తాటిచెట్టుకు ఢీకొన్నారు. చికిత్స నిమిత్తం ముగ్గురికి నెల్లూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శంకరయ్య మృతిచెందాడు. గాయపడిన యువకులు కోలుకుంటున్నారు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు.

నాగారపమ్మకు ప్రత్యేక పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

సంగం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలగట్ల పెన్నానది ఒడ్డున ఉన్న పురాతన నాగారపమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పక్కాగృహాల కోసం దరఖాస్తు చేసుకోవాలి

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పీఎంఏవై 2.0 పథకం కింద పక్కాగృహాలకు దరఖాస్తు చేసుకునేందుకు సోమవారంతో గడువు ముగుస్తుందని హౌసింగ్ వర్క్ఇన్స్‌పెక్టర్ నాయబ్‌రసూల్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఇంతవరకు 1034 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గీయులు కుల, ఆదాయ, పొజిషన్ ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఓసీ వర్గీయులు ఆదాయ, పొజిషన్ పత్రాలతో సోమవారం మధ్యాహ్నానికి స్థానిక కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటే ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు.

● సీతారామపురం: పక్కాగృహాల కోసం మండలంలోని 14 పంచాయతీల పరిధిలోని 803 మంది దరఖాస్తు చేసుకున్నారని హౌసింగ్ ఏఈ కరిముల్లా తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, పొజిషన్ పత్రం, ఓసిలైతే ఆదాయ ధ్రువీకరణ, పొజిషన్ పత్రాలు మండల కేంద్రంలోని హౌసింగ్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం లోపు అందించాలని ఆదివారం హౌసింగ్ ఏఈ ఒక ప్రకటనలో తెలిపారు.

6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఉదయగిరి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 11 ఆదర్శ పాఠశాలల్లో 6వ తరగతిలో ప్రవేశానికి ఈనెల 31వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఎంఈవో షేక్ మస్తాన్‌వలి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఓసీ, బీసీలు రూ. 150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75 దరఖాస్తు రుసుము చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 20వ తేదీన నిర్వహించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కూటమి ప్రభుత్వంతో అభివృద్ధికి బాటలు



ట్రై సైకిళ్లు అందిస్తున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

గుడ్లూరు మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధికి బాటలు వేస్తున్నట్లు నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తెలిపారు. మండలకేంద్రంలోని హైస్కూల్ ప్రాంగణంలో ఆదివారం నియోజకవర్గస్థాయి తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన ఆత్మీయసమావేశంలో ఆయన పాల్గొన్నారు. మొదటగా 147మంది దివ్యాంగులకు బ్యాటరీ ట్రై సైకిళ్ల పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభకార్యక్రమంలో వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. అందులో భాగంగానే కందుకూరు అభివృద్ధికి రూ.50కోట్లు కేటాయించారని గుర్తు చేశారు. అర్హతున్న వారికి ట్రై సైకిళ్లు అందకుంటే రెండోవిడతలో పంపిణీ చేస్తామన్నారు. అనంతరం కందుకూరు శాసన సభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడారు. విపీఆర్ ట్రస్టు అన్నివర్గాల వారికి చేయూత ఇవ్వడం హర్షణీయం అన్నారు.

కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు అబ్దుల్ అజీజ్, మండల అధ్యక్షులు జనిగర్ల నాగరాజు, వేముల గోపాల్‌రావు, మాదాల లక్ష్మీనరసింహం, దామా మల్లేశ్వరరావు, రాచగల్లు సుబ్బారావు, గ్రామపార్టీ అధ్యక్షులు పువ్వాడి శ్రీనివాసులు, సర్పంచ్ పాలకీర్తి శంకర్, ఎంపిటీసీ సభ్యురాలు చెన్నారెడ్డి వరమ్మ, పార్టీ నాయకులు పువ్వాడి వేణుగోపాల్, రావూరి వేణు, రాఘవులు, పిడికిటి వెంకటేశ్వర్లు, బీజేపీ జిల్లా అధ్యక్షులు వంశీరెడ్డి, పార్టీ కందుకూరు కన్వీనర్ హరిబాబు, జనసేన నాయకులు కొనిదెల శ్రీనివాసులు, అంగులూరి నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

బుడంగుంటకాలనీలో బాలిక అపహరణకు యత్నం

● అవ్వతో ఇంటికి వెళుతుండగా ఘటన ● కేకలు వేయడంతో మేలుకున్న స్థానికులు

● బైక్‌తో వెంబటించడంతో దుండగుల పరారీ

కావలి రూరల్, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని బుడంగుంటకాలనీలో బాలిక కిడ్నాప్‌కు శనివారం అర్ధరాత్రి ఇద్దరు వ్యక్తులు యత్నించారని బాలిక అమ్మమ్మ కుంచాల మంగమ్మ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. రూరల్ పోలీసుల తెలిపిన వివరాల మేరకు.. కాలనీలో నివసించే మంగమ్మ అదేకాలనీలోని పక్కవీధిలో ఉంటున్న కుమార్తె నాగమణి ఇంటికి వెళ్లింది. మనవడు, 6ఏళ్ల మనవరాలు కలిసి మంగమ్మ ఇంటికి వస్తుండగా మాస్కులు ధరించిన ఇద్దరు వ్యక్తులు మోటారు బైక్‌పై వచ్చి మంగమ్మను ప్రక్కకు నెట్టి మనవరాలిని బైకుపై ఎక్కించుకుని వెళ్లారు. మంగమ్మ పెద్దగా కేకలు వేయడంతో స్థానికులు గుర్తించి వారిని మోటారు సైకిళ్లపై వెంబడించారు. దీంతో ఆ వ్యక్తులు మోటారు బైకుతో పాటు బాలికను అక్కడే వదిలి పరారీ అయ్యారు. ఈ ఘటనలో చేతికి స్వల్పగాయమైన బాలికను ఏరియా ఆస్పత్రికి తరలించారు. రూరల్ సీఐ రాజేశ్వరరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించి బాధితుల నుండి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదేకాలనీలో ఉంటున్న నరేంద్ర, హజరత్‌లకు మాకు పాత గొడవలు ఉన్నాయని బాలిక అమ్మమ్మ మంగమ్మ వారిపై అనుమానం వ్యక్తం చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

● భర్త వేధింపుతోనే అని తల్లి ఫిర్యాదు

నెల్లూరు(క్రైం), మార్చి 9(ఆంధ్రజ్యోతి): పొర్లుకట్ట ప్రాంతంలో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల సమాచారం మేరకు.. కందుకూరు షేక్ నమీనా(37)కు పొర్లుకట్టకు చెందిన మున్వర్‌తో కొన్నేళ్ల క్రితం వివాహం చేశారు. వీరికి మహిరా, అక్బర్ సంతానం. మున్వర్ 2016లో రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అప్పటినుంచి నమీనా నగరంలోని ఓ జెరాక్స్ షాప్‌లో పనిచేస్తూ పిల్లలను పోషిస్తోంది. పొర్లుకట్టలోనే నివాసమున్న మున్నా భార్య నుంచి విడిపోయాడు. ఈ క్రమంలో నమీనాకు మున్నాతో పరిచమైంది. పిల్లల్ని బాగా చూసుకుంటానని చెప్పడంతో ఈ విషయాన్ని తన తల్లిదండ్రులకు తెలిపింది. వారి అంగీకరించడంతో 2017లో వివాహం చేసుకున్నారు. కొద్దిరోజులు బాగానే ఉన్నా పిల్లల విషయంలో వారి మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. ఇదిలా ఉండగా నమీనా పొదుపులో రూ.4లక్షల రుణం తీసుకుని భర్తకు ఇచ్చింది. రుణం చెల్లింపులో ఈ నెల 8వ తేదీ వారి మధ్య గొడవ జరిగింది. ఆ తర్వాత మున్నా ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఆదివారం తెల్లవారుజామున మున్నా తన భార్యకు వీడియో కాల్ చేసి మాట్లాడాడు. ఆ తర్వాత ఏం జరిగిందో ఏమో తెలియదుగానీ నమీనా ఇంట్లోనే చీరతో ఉరివేసుకుంది. గమనించిన కుమారుడు పెద్దగా కేకలు వేయడంతో స్థానికులు అక్కడకు చేరుకొని నమీనాను రామచంద్రారెడ్డి వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. నమీనా తల్లి బీబీజాన్ ఫిర్యాదు మేరకు సంతపేట పోలీసులు కేసు నమోదు చేశారు. నమీనా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో బిహార్ యువకుడి మృతి



మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలిస్తున్న పోలీసులు

ఉలవపాడు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి):స్థానిక జాతీయ రహదారిలోని రాజుపాలెం మలుపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆదివారం బిహార్‌కు చెందిన యువకుడు ప్రశాంత్(25) మృతి చెందాడు. ఎస్ఐ అంకమ్మ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చాగొల్లు గ్రామానికి చెందిన వల్లూరు కిశోర్ తన వ్యవసాయ పొలంలో పశువుల పారంలో మరో నలుగురితో కలిసి ప్రశాంత్ పని చేస్తున్నాడు. ఈయన చెప్పులు తెచ్చుకుంటానని ద్విచక్ర వాహనంపై ఉలవపాడుకు వెళ్లి తిరిగి వచ్చే క్రమంలో వెనుక వైపు నుంచి వచ్చిన లారీ ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్ లారీని ఆపకుండా మోచర్ల వద్దకు వెళ్లి లారీని నిలిపి పరారీ అయ్యాడు. పోలీసులకు లారీలో దొరికిన ఫోన్ నెంబర్ల ఆధారాలతో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉలవపాడు సీహెచ్‌సీకి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

శిథిలావస్థలో ఇరిగేషన్ అతిథి భవనం

● భయాందోళనలో సిబ్బంది



శిథిలావస్థలో ఉన్న ఇరిగేషన్ అతిథి భవనం

సంగం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయానికి ఎదురుగా సంగం - నెల్లూరు రహదారి పక్కనే ఉన్న ఇరిగేషన్ అతిథి భవనం శిథిలావస్థకు చేరి ఎప్పుడు కూలుతుందోనని సిబ్బంది భయాందోళన చెందుతున్నారు. ఈ భవనాన్ని 1882లో బ్రిటీష్ అధికారులు నిర్మించారు. సంగం వద్ద పెన్నానదిలో బ్యారేజి నిర్మాణ సమయంలో అధికారులతోపాటు, ఇంజనీరింగ్ అధికారుల విశ్రాంతి కోసం దీన్ని నిర్మించారు. చరిత్రకు చిహ్నంగా నిలిచిన ఈ భవనం పెంకులు దెబ్బతిన్నాయి. దీంతో పైకప్పు ఊడి కింద పడింది. సిబ్బంది తృటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. దీంతో ఈ భవనం ఎప్పుడు కూలుతుందోనని కాపలా ఉన్న సిబ్బంది భయపడుతున్నారు.

మరమ్మతులకు ప్రతిపాదనలు

చరిత్రకు చిహ్నంగా ఉన్న ఈ భవనాన్ని రూపు కోల్పోకుండా మరమ్మతులు చేసేందుకు స్థానిక అధికారులు గతంలో ప్రతిపాదనలు పంపారు. వైసీపీ ప్రభుత్వం భవనం గురించి పట్టించుకున్న పాపాన పోలేదు. నిధులు మంజూరు కాలేదు. కూటమి ప్రభుత్వంలోనైనా పాలకులు, అధికారులు స్పందించి నిధులు మంజూరుచేసి చరిత్రకు చిహ్నంగా ఉన్న పురాతన భవనానికి మరమ్మతు పనులు చేయాలని పలువురు కోరుతున్నారు.

సమావేశానికి హాజరుకాని అధికారులపై చర్యలు : జడ్పీటీసీ



సమావేశంలో ఆర్అండ్‌బీ ఏఈని వివరాలు అడుగుతున్న జడ్పీటీసీ అనిల్‌కుమార్‌రెడ్డి

కలువాయి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశానికి హాజరుకాని అధికారులపై చర్యలు తీసుకోవాలని తీర్మానం చేసి జిల్లా కలెక్టర్‌కు పంపనున్నట్లు జడ్పీటీసీ బి అనిల్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ ఆర్ లక్ష్మీదేవి అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశానికి కీలక శాఖల అధికారులు డుమ్మా కొట్టారు. దీంతో అధికారుల తీరుపై జడ్పీటీసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో నెలకొన్న పలు సమస్యలపై సర్పంచులు, ఎంపీటీసీల ప్రశ్నలకు ఎవరు సమాధానం ఇస్తారని ఆయన అన్నారు. ఇకపై గ్రామ స్థాయిలో జరిగే ప్రతి అభివృద్ధి పని వివరాలు స్థానిక ప్రజాప్రతినిధులకు అధికారులు తెలియజేయాలని కోరారు. వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను కోరారు. అసంపూర్తిగా ఉన్న సచివాలయాలు, హెల్త్ సెంటర్ల భవనాలు పూర్తి చేసేందుకు ప్రభుత్వం వివరాలు కోరినట్లు పంచాయతీరాజ్ ఏఈ జయరామిరెడ్డి సభకు తెలిపారు. కలువాయి విద్యుత్ సబ్‌స్టేషన్‌కు లోడ్ తక్కువగా ఉందని, బ్రాహ్మణపల్లి, పెన్నబద్వేలి గ్రామాలను కూడా దీనిలో కలపాలని సమావేశంలో ప్రజాప్రతినిధులు విద్యుత్‌శాఖ అధికారులను కోరారు. దీంతో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోతామని విద్యుత్‌శాఖ ఏఈ తెలిపారు. మండలంలో 12 పాఠశాలలను మోడల్ ప్రాథమిక పాఠశాలలుగా మార్చేందుకు ప్రతిపాదనలు పంపినట్లు ఎంఈవో శేషగిరిరావు తెలిపారు. తెలుగురాయపురం నుంచి కలువాయి వరకు రోడ్డు నిర్మాణానికి రూ.3కోట్లు, వెంకటరెడ్డిపల్లి వద్ద పైపు కల్వర్టు, సిమెంటు రోడ్డు నిర్మాణానికి రూ.75లక్షలతో అంచనాలు పంపామని, మార్చి నెలాఖరు నాటికి మంజూరు వస్తుందని ఆర్అండ్‌బీ ఏఈ అన్వేష్ తెలిపారు. సమావేశంలో వైస్ ఎంపీపీ పంగా పెంచలనరసారెడ్డి, ఎంపీడీవో ఎం.భవాని, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి అందజేత



బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును అందజేస్తున్న మంత్రి ఆనం

మర్రిపాడు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : ఆపదలో ఉన్న ప్రతీ కుటుంబాన్ని కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. ఆదివారం నెల్లూరులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మర్రిపాడు మండలానికి చెందిన 8మందికి రూ. 14,54,785 ముఖ్య మంత్రి సహాయనిధి చెక్కులను బాధితులకు అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు పడుతున్న కుటుంబాలను కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపి అధ్యక్షుడు ఆరికట్ల జనార్ధన్‌నాయుడు పాల్గొన్నారు.

చలో పిఠాపురం పోస్టర్ ఆవిష్కరణ



వాల్ పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న జనసేన నాయకులు, కార్యకర్తలు

సంగం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక జనసేన నాయకులు ఆదివారం ఆ పార్టీ ఆవిర్భావ దినోత్సవం కార్యక్రమాన్ని పురస్కరించుకుని చలో పిఠాపురం వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈనెల 14వ తేదీన పిఠాపురంలోని చిత్రాడ గ్రామంలో జరిగే జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవానికి తరలిరావాలని పిలుపునిస్తూ పోస్టర్‌లను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు భానుకిరణ్, మండల ప్రధాన కార్యదర్శి దంతాల హజరత్, మండల ఉపాధ్యక్షుడు రవిచంద్ర, రాజా, కార్యకర్తలు, పవన్ కల్యాణ్ అభిమానులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు

సంగం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆపస్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో మండలంలోని ఐదవ తరగతి విద్యార్థులకు ఆదివారం ప్రతిభా పాటవ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలకు మండలంలోని సుమారు 45 పాఠశాలల నుంచి 230 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ పరీక్షల్లో ప్రతిభ కనబరిచి మొదటి పది స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆపస్ ఉపాధ్యాయ సంఘం నాయకులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

సీపీఎం ప్రజా చైతన్య యాత్రల ప్రారంభం

కావలి టౌన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలన్నీ అమలు చేయాలని సీపీఎం కార్యదర్శి వర్గసభ్యులు మాదాల వెంకటేశ్వర్లు డిమాండు చేశారు. సీపీఎం పట్టణ కమిటీ కార్యదర్శి పసుపులేటి పెంచులయ్య అధ్యక్షతన ఆదివారం స్థానిక కసాయి వీధిలో సీపీఎం ప్రజా చైతన్యయాత్రను మాదాల ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 8నెలలైనా ఎన్నికల ప్రధాన హామీలు అమలు చేయకపోవడం దుర్మార్గమన్నారు. సర్దుబాటు చార్జీల పేరుతో పేదలను దోచుకోవడం, పెట్రోల్ డీజిల్, నిత్యావసరాలు ధరలు నియంత్రించలేకపోవడం మంచి ప్రభుత్వమా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎస్ వెంకయ్య, కృష్ణయ్య, మధుసూదన్‌రావు, మస్తాన్, బాబురావు పాల్గొన్నారు.

వైసీపీ పూర్వవైభవానికి కృషి చేద్దాం..

వలేటివారిపాలెం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పార్టీకి పూర్వ వైభవం తీసుకవచ్చేందుకు నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా కృషి చేద్దాం అని పార్టీ మండల కన్వీనర్ అనుమోల లక్ష్మీనరసింహం కోరారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో ఆదివారం 13విభాగాలకు చెందిన నూతన మండల కమిటీల ఎన్నిక జరిగింది. అనంతరం లక్ష్మీనరసింహంనకు కార్యకర్తలు, నాయకులు శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు చింతలపూడి రవీంద్ర, కాకు వెంకటస్వామి, నల్లమోతు చంద్రమౌళి, నాగిరెడ్డి శివరామిరెడ్డి, ఇరపని అంజయ్య, గుత్తా గోపి పాల్గొన్నారు.

● లింగసముద్రం (ఆంధ్రజ్యోతి): వైసీపీ పటిష్టతకు కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు నోటి వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం స్థానిక పార్టీ కార్యాలయంలో వెంకటేశ్వరరెడ్డి అధ్యక్షతన 20మండల కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే యూత్ విభాగం, వాలంటరీ, ఎస్సీ, బీసీ, మైనారిటీ, క్రిష్టియన్ ఇలా మరో 15కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎంపీపీ పెన్నా కృష్ణయ్య, తిరుపతిరెడ్డి, షేక్ షఫి, చీమల శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, వేణు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అవినీతికి పాల్పడలేదని ప్రమాణం చేసే దమ్ముందా?

కావలి టౌన్, మార్చి9 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి అవినీతి అక్రమాలకు పాల్పడలేదని శివాలయం, పోలేరమ్మ అరుగు వద్ద ప్రమాణం చేసే దమ్ముందా? అని మాజీ ఏఎంసీ చైర్మన్ మన్నెమాల సుకుమార్ రెడ్డి సవాల్ విసిరారు. ఆదివారం తుమ్మల పెంట రోడ్డువద్ద నున్న తన కార్యాయలంలో అనుచరులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తనను పార్టీ నుంచి సస్పెండ్ చేయడం మాజీ ఎమ్మెల్యే కుట్రే అన్నారు. షోకాజ్ నోటీస్ ఇవ్వకుండా సస్పెండ్ చేయడం ఎక్కడా లేదన్నారు. 2019 ఎన్నికల్లో బెంగుళూరు నుంచి చీప్ లిక్కర్ అక్రమంగా తెచ్చి ఓటర్లకు పంచి అనేకమంది ప్రాణాలు పోయేందుకు కారణం అయినట్లు తెలిపారు. ఆయా మండలాల్లోని ప్రాంతాల్లో ఎవరి వద్ద డంప్ చేశారో తన వద్ద సాక్ష్యాలు ఉన్నాయని ఆ కేసును తానపై వేసుకుని జైల్‌కు పోయిన విషయాన్ని గుర్తు చేశారు. తాను చేసిన ఆరోపణలకు సాక్ష్యాలున్నాయని ప్రతాప్‌కుమార్ రెడ్డి దమ్ముంటే బహిరంగ చర్చకు సిద్ధంగా ఉండారా అని ప్రశ్నించారు.

రైతు సంఘం నాయకులను అరెస్ట్ చేసి, నోటీసులు

కావలి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఏపీ రైతు, వ్యవసాయ సంఘాల ఆధ్వర్యంలో గుంటూరులో తలపెట్టిన మహాధర్నాకు అనుమతులు లేదంటూ కావలి టూటౌన్ పోలీస్‌లు ఆదివారం రైతు సంఘం నాయకులకు నోటీస్‌లు అందజేశారు. అనంతరం రైతుసంఘం జిల్లానాయకుడు బలిజేపల్లి వెంకటేశ్వర్లు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు దమ్ము దర్గాబాబులను అదుపులోకి తీసుకున్నారు. అక్రమ అరెస్టులు రైతాంగ ఉద్యమాలను ఆపలేవన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, అర్హతకలిగిన రైతులకు రుణాలు మంజూరు చేయాలని, రైతులకు రుణమాఫీ చేసి కేరళ తరహా రుణవిమోజన చట్టాన్ని తీసుకు రావాలని వారు కోరారు. 60 సంవత్సరాలు నిండిన రైతులు, కౌలు రైతులకు, వ్యవసాయ కార్మికులకు రూ.10 వేలు పింఛన్ ఇవ్వాలని కోరారు.

పునరాలోచన చేయాలి

కందుకూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానం సరైనది కాదని, ఈ విషయంపై పునరాలోచన చేయాలని మాలమహానాడు డివిజన్ అధ్యక్షుడు లింగాబత్తిన బ్రహ్మయ్య అన్నారు. పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో ఆదివారం మాల మహానాడు, మాల ఉద్యోగుల సంఘం ఆత్మీయ సమావేశం సూర్యం అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో బ్రహ్మయ్య పాల్గొని పట్టణ నూతన కమిటీని ఏకగ్రీంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బొట్లగుంట శ్రీనివాసులు, గౌరవాధ్యక్షుడుగా చెక్క సింగయ్య, బందెల మాల్యాద్రి ఉన్నారు. కార్యక్రమంలో డీసీహెచ్ మాలకొండయ్య, పాలేటి కోటేశ్వరరావు, కట్టా రమేష్, సింగయ్య, నల్లపు చంద్రశేఖర్, ధర్మయ్య పాల్గొన్నారు.

వాహన చట్టం నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

● ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి



ఉదయగిరి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు మోటార్ వాహన చట్టం నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఉదయగిరి ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి హెచ్చరించారు. మార్చి 1వ తేదీ నుంచి నూతన మోటార్ వాహనం చట్టం అమల్లోకి వచ్చింది. నిబంధనలు పాటించని వాహనదారులకు రెట్టింపు అపరాధ రుసుం విధించనున్నట్లు తెలిపారు.

? ప్రమాదాల నివారణకు ఏమి చర్యలు తీసుకుంటున్నారు.

! ప్రమాదాల నివారణకు వాహనదారులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో వేగనిరోధకాలు ఏర్పాటు చేస్తున్నాం.

? మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై చర్యలు చేపడుతున్నారా.

! ప్రతిరోజు స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహిస్తున్నాం. మద్యం సేవించి వాహనాలు నడిపే వారికి అపరాధ రుసుం విధించి, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచిస్తూ కౌన్సిలింగ్ ఇస్తున్నాం.

? ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నారా.

! ఉదయగిరి పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపడుతున్నాం. ప్రధాన కూడళ్లలో పోలీసు సిబ్బందిని ఏర్పాటుచేసి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూస్తున్నాం. ఆటోలు, సరుకు దిగుమతి చేసే వాహనాలు రహదారులపై నిలపకుండా చూస్తున్నాం.

ఉదయగిరి అభివృద్ధే ధ్యేయం : ఎమ్మెల్యే కాకర్ల



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

వింజమూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే ధ్యేయం అని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అన్నారు. మండలంలోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 9నెలల కాలంలో సుమారు రూ. 150 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, ఆరోపణలు మాని అభివృద్ధికి సహకరించాలని కోరారు. తాగునీటి సమస్య అధిగమించేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో 8 మండలాల టీడీపీ కన్వీనర్లు, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఉదయగిరిని జిల్లా చేయాలని ఉద్యమం

● జిల్లా సాధన సమితి అధ్యక్షుడు డాక్టర్ వేణుగోపాల్



విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ వేణుగోపాల్

ఉదయగిరి, మార్చి 9(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రమైన ఉదయగిరిని రెవెన్యూ డివిజన్ చేసేందుకు పరిశీలన చేస్తున్నామని రెవెన్యూ శాఖామంత్రి అనగాని సత్యప్రసాద్ అసెంబ్లీలో ప్రకటించడం జిల్లా సాధన ఉద్యమానికి ఊపిరినిచ్చిందని సాధన సమితి అధ్యక్షుడు డాక్టర్ కె వేణుగోపాల్ అన్నారు. ఆదివారం స్థానిక శ్రీచైతన్య ఐటీఐ కళాశాలలో విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయగిరిని జిల్లా చేయాలని తాము చేసిన ఉద్యమ ఫలితంగా ఉదయగిరిని రెవెన్యూ డివిజన్ చేసేందుకు ప్రభుత్వం పరిశీలన చేస్తుండడం హర్షణీయమని, ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపామన్నారు. ఉదయగిరిని జిల్లా చేయాలని అసెంబ్లీలో గళాన్ని వినిపించాలని ఎమ్మెల్యేను కోరగా ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. ఉదయగిరిని జిల్లా చేయాలనే ఉద్యమాన్ని ఇకనుంచి ఉధృతం చేస్తామని, పార్టీలకతీతంగా రాజకీయ నాయకులు, మేధావులు, ప్రజాసంఘాల నాయకులు, ప్రజలు, శ్రామికులు, కర్షకులు, యువత, ఉద్యోగులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాధన సమితి నాయకులు షేక్ దస్తగిరి అహ్మద్, షేక్ ఖాదర్‌బాషా, గాజులపల్లి రామిరెడ్డి, ఏడుకొండలు, ఖాదర్‌బాషా, ఫణిరాజ్ పాల్గొన్నారు.

ధ్యానంతో అన్ని సమస్యలు దూరం

వింజమూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ధ్యానంతో అన్ని సమస్యలు దూరమవుతాయని హైదరాబాద్ సీనియర్ పిరమిడ్ మాస్టర్ ఓం ప్రకాష్ అన్నారు. ఆదివారం ఆత్మజ్ఞానంలో భాగంగా శ్రీవేదవ్యాస వశిష్ఠ పిరమిడ్ మహాశక్తి క్షేత్రంలో ఆయన మాట్లాడారు. అనంతరం శాకాహారం ప్రాముఖ్యతను వివరిస్తూ కరపత్రాలు పంచుతూ ర్యాలీ నిర్వహించారు.


ఘన సంపద.. శిథిలావస్థ!


- కళావిహీనంగా రంగనాయకులస్వామి ఆలయం
- నాడు ధూపదీప నైవేద్యాలతో విరాజిల్లి.. నేడు చరిత్రకు సజీవసాక్ష్యంగా మిగిలి...

ఉదయగిరి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): అలనాటి శిల్పకళా నైపుణ్యం తీపిగుర్తులు పంచే ఆలయాల ఆనవాళ్లతో చరిత్రకు సజీవ సాక్ష్యంగా ఉదయగిరి చరిత్ర పుటల్లో చిరస్థాయి పేరు లిఖించుకుంది. క్రీ.శ 10 నుంచి 18వ శతాబ్దం వరకు చోళులు, పల్లవులు, రెడ్డిరాజులు, గజపతులు, విజయనగర రాజులు, గోల్కొండ నవాబుల పాలన ఉదయగిరిలో కొనసాగినట్లు చరిత్ర ఆధారాల ద్వారా తెలుస్తోంది. దక్షిణ భారతదేశాన్ని ఏలిన విజయనగర రాజుల పాలనలో 365 ఆలయాలు, వాటి ముంగిట కోనేర్లతో నిత్యం ధూపదీప వేవేద్యాలతో ఉదయగిరి దేదీప్యమానంగా వెలుగొందింది. వాటిల్లో ఒకటి శ్రీరంగనాయకులస్వామి ఆలయం. పట్టణానికి అపూర్వ శోభనిచ్చే ఈ ఆలయం విజయనగర రాజుల కాలంలో అంగరంగ వైభవంగా వెలుగొందింది. ఈ ఆలయ కట్టడం జిల్లాలో మరెక్కడా కనిపించదు. అంతటి ప్రాచుర్యం పొందిన ఆ ఆలయం ప్రస్తుతం చరిత్రకు సజీవ సాక్ష్యంగా మిగులుతోంది.



రంగనాయకుల స్వామి ఆలయ ముఖద్వారం





ఆలయ మండపాలు, గోడలపై అలనాటి శిల్పకళా నైపుణ్యం

● అద్భుతం.. నాటి కళా నైపుణ్యం

రంగనాయ కులస్వామి ఆలయంలో కళా నైపుణ్యం అద్భుతం. ఆలయ ముఖ ద్వారం పెనుశిలలతో నిర్మితమై ఉంటుంది. ముఖ ద్వారంపై నిలువెత్తు సుందరీమణుల విగ్రహాలు, నగిషీలు అలనాటి శిల్పాకళాచాతుర్యానికి నిదర్శనం. ఆలయం చుట్టూ రెండు వరుసల్లో ఎత్తయిన ప్రాకారాలు కనిపిస్తాయి. వాటికి పెద్ద పెద్దరాళ్ల తాపడం చేశారు. మొదటి ప్రాకారం లోపలి భాగంలో నాలుగు వైపులా నాలుగు మండపాలు ఎంతో చూడముచ్చటగా ఉంటాయి. ఇక ఆలయ గర్భగుడికి ఎదురుగా నిర్మించిన గాలిగోపురం జీవకళ ఉట్టిపడే శిల్పసంపద సందర్శకులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. ఆలయ గోడలు, మండపాలు, ముఖద్వారం, గాలిగోపురంపై చెక్కిన శిల్పాలు అలనాటి విజయనగర రాజుల శిల్పకళా సౌందర్యాన్ని చాటి చెబుతున్నాయి. ఉదయగిరి దుర్గం (కొండ) పడుకుని ఉన్న మానవుడి ఆకారంలో కనిపిస్తుండటంతో వాస్తు ప్రకారం ఇక్కడ రంగనాయ కులస్వామి ఆలయాన్ని నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది.

● నెల్లూరుకు మూలవిరాట్

ఈ ఆలయంలోని మూలవిరాట్‌ను 19వ శతాబ్దంలో నెల్లూరు రంగనాయకులస్వామి ఆలయంలో ప్రతిష్ఠించారని పలువురు చర్చించుకుంటారు. ఆలయానికి ఎదురుగా 500 మీటర్ల దూరంలో నాలుగు స్తంభాలతో కూడిన ఎత్తయిన గాలిగోపురం కనిపిస్తుంది. శ్రీకృష్ణదేవరాయుల కాలంలో నిత్యం పూజార్చన లతో ఆ ఆలయం విరాజిల్లుతుండేది. ఆ తర్వాత శిథిలస్థితికి చేరుకుంటోంది. భారత పురావస్తుశాఖ ఈ ఆలయాన్ని ప్రాచీన సంపదగా గుర్తించి పరిరక్షిస్తున్నా ఆశించిన మేర అభివృద్ధి మాత్రం జరగడం లేదు. ఇంతటి చరిత్ర కలిగిన ఈ ఆలయాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తే భావితరాలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.





ఆలయం చుట్టూ ఎత్తయిన ప్రాకారాలు

ప్రైవేట్ కళాశాలల గుర్తింపు దరఖాస్తు గడువు పొడిగింపు

నెల్లూరు(విద్య), మార్చి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రైవేట్ జూనియర్ కళాశాలలకు 2025-26 విద్యా సంవత్సరానికి ప్రొవిజినల్ అఫ్లియేషన్ రెన్యువల్ దరఖాస్తుకు ప్రభుత్వం గడువు పొడిగించినట్లు ఆర్ఐవో డాక్టర్ ఏ శ్రీనివాసులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కళాశాల గుర్తింపుతోపాటు కోర్సుల మార్పిడి, కొత్త కోర్సులు, అదనపు సెక్షన్ల మంజూరు, ద్వితీయ భాష, మీడియం మార్పుల అనుమతి, ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి కళాశాల తరలింపు, కళాశాల మూసివేత, మూతబడిన కళాశాల పునః ప్రారంభం, కళాశాలల పేరు మార్పు వంటి అంశాలకు ఈనెల 15వతేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

ఓపెన్ స్కూల్ టెన్త్ హాల్‌టికెట్ల విడుదల

నెల్లూరు(విద్య), మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఏపీ సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్) టెన్త్ పరీక్షలు ఈనెల 17వతేదీ నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో పరీక్షలకు హాజరయ్యే అభ్యాసకుల హాల్ టికెట్లు విడుదలైనట్లు డీఈవో డాక్టర్ ఆర్ బాలాజీరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. హాల్ టికెట్లు సంబంధిత స్టడీసెంటర్లలో అందుబాటులో ఉన్నాయని, వాట్సాప్, మనమిత్ర ద్వారా కూడా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు.

కోడి పందెం స్థావరంపై పోలీసుల దాడి

20 మోటారు సైకిళ్ల స్వాధీనం

కలువాయి, (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలాత్మకూరు గ్రామ సమీపంలోని పొలాల్లో నిర్వహిస్తున్న కోడిపందెం స్థావరంపై ఆదివారం సాయంత్రం రాపూరు సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేసి ఐదుగురిని అదుపులోని తీసుకున్నారు. వారి నుంచి 8కోళ్లు, రూ.12,800 నగదు, 20 మోటారుసైకిళ్లు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వచ్చే నెలలో అమరావతి పనులు

- దేవదాయ మంత్రి ఆనం
- 27 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి రామనారాయణరెడ్డి

నెల్లూరు (వైద్యం) మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రానికి ఏకైక రాజధాని అమరావతి అని, ఏప్రిల్ నెలలో పనులు మొదలవుతాయని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రాయనారాయణరెడ్డి తెలిపారు. నెల్లూరులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆత్మకూరు నియోజకవర్గంలోని 27 మంది లబ్ధిదారులకు రూ.48.60 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహిం చిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలే అయిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని రూ.10 లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి నెట్టేసిందని విమర్శించారు. ప్రస్తుతం రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్నామని వెల్లడించారు. సూపర్‌సిక్స్ పథకాలను తప్పక అమలు చేస్తామని చెప్పారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి ఎంత ఖర్చయినా భరించేందుకు కేంద్రం సిద్ధంగా ఉందన్నారు. వైసీపీకి రాష్ట్ర ప్రజలే ప్రతిపక్ష హోదా ఇవ్వనప్పుడు మేమెందుకు ఇవ్వాలని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆర్టీసీకి విద్యుత్ బస్సులు ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

- ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి



సమావేశంలో మాట్లాడుతున్న దామోదరరావు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీలో విద్యుత్ బస్సులను ప్రవేశపెట్టాలన్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని, అయితే ఆ బస్సులను ప్రైవేటు యాజమాన్యం ద్వారా కాకుండా ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆర్టీసీకి అప్పగించాలని ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదర్‌రావు విజ్ఞప్తి చేశారు. నెల్లూరులోని ఆర్టీసీ ప్రధాన బస్టాండు సమీపంలోని ఓ సమావేశ మందిరంలో ఆదివారం ఏపీపీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కౌన్సిల్ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన దామోదరరావు మాట్లాడుతూ ఉద్యోగులకు చెల్లించాల్సిన 11వ పీఆర్సీ 24 నెలల అరియర్స్, డీఏ బకాయిలు ప్రభుత్వం వెంటనే చెల్లించాలని, ఎన్నికల్లో కూటమి నాయకత్వం ఇచ్చిన హామీ మేరకు 12వ పీఆర్సీ కమిషన్ వేయాలని డిమాండ్ చేశారు. సంస్థలో 10వేల ఉద్యోగ ఖాళీలు భర్తీ చేయాలని, అర్హత కలిగిన ఉద్యోగులకు పదోన్నతి కల్పించాలని కోరారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు యుగంధర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచల్‌రెడ్డి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమం లో రాష్ట్ర ఉపాధ్యక్షుడు జీ నారాయణరావు, జోన్ అధ్యక్షుడు వాకా రమేష్, జోనల్ కార్యదర్శి దాసరి బాబు శామ్యూల్, నాయకులు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు సౌలభ్యం

- టెన్త్ పరీక్షల్లో మినహాయింపులు
- అధికారుల ప్రత్యేక ఏర్పాట్లు

నెల్లూరు (విద్య), మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 17 నుంచి 31వతేదీ వరకు పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయి. ఈ పరీక్షల్లో దివ్యాంగ విద్యార్థులకు అనేక సౌలభ్యాలను కల్పించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. దీనికోసంగా వారికి ప్రత్యేక మినహాయింపులు, రాయితీలు ఇచ్చేలా జీవో నెం 86 విడుదల చేసింది. జిల్లాలో 163 మంది దివ్యాంగ విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు అధికారులు తెలిపారు. వీరి కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయడమేకాక ఆ విద్యార్థులందరూ కచ్చితంగా పరీక్షలకు హాజరయ్యేలా రవాణా, ఇతర సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అర్హులందరూ ఈ ప్రయోజనాలు పొందేందుకు తగిన ధ్రువపత్రాలు అందించి పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. దీనిపై ఇప్పటికే అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సమాచారం అందించారు.

● శారీరక దివ్యాంగులైన విద్యార్థులకు ఏదైనా ఒక భాష నుంచి పరీక్ష రాయకుండా మినహాయింపు ఇస్తారు. మిగిలిన వాటిల్లో 35 మార్కులు సాధించాల్సి ఉంటుంది.

● అంధులకు కూడా ఒక భాష నుంచి మినహాయింపు ఇవ్వగా మిగిలిన పరీక్షల్లో కనీసం 20 మార్కులు సాధించాల్సి ఉంటుంది.

● వినికిడి లోపం ఉన్న వారికి రెండు భాషల పరీక్షలు రాయకుండా మినహాయింపు ఇచ్చారు. వీరు మిగిలిన వాటిల్లో 20 మార్కులు తెచ్చుకుంటే ఉత్తీర్ణత సాధించినట్లే!. వీరితో పాటు మాట లోపం ఉన్న విద్యార్థులు ఆరు సబ్జెక్టులలో 20 మార్కులు తెచ్చుకోవాలి.

● కుష్ఠు బాధితులు, పక్షవాతం, మరుగుజ్జులు, యాసిడ్ దాడికి గురైన వారికి ఒక భాష నుంచి మినహాయింపుతోపాటు మిగిలిన పరీక్షల్లో 10 మార్కులు సాధిస్తే సరిపోతుంది.

● అభ్యసన వైకల్యం ఉన్నవారికి ఆంగ్లం నుంచి మినహాయింపు ఇచ్చారు. మిగిలిన వాటిల్లో 15 మార్కులు సాధించాల్సి ఉంటుంది.



● అంధులు, చేతులకు సంబంధించిన వైకల్యం ఉన్న వారికి, ఎమ్మార్, సీపీ, న్యూరో సమస్యలతో చేతులు పనిచేయని వారికి ఒక సహాయకుడిని కేటాయించి పరీక్ష రాసే అవకాశం కల్పిస్తారు. వీరికి అదనంగా మరోగంట సమయం కూడా కేటాయిస్తారు.

● దివ్యాంగులందరికీ అవసరం మేరకు వివిధ పరికరాలు, కుర్చీలు, కంటి అద్దాలు, కాలిక్యులేటర్, శ్రవణ యంత్రాలు, కృత్రిమ అవయవాలు, సహాయకులను వెంట తెచ్చుకునేందుకు ముందుగా దరఖాస్తు చేసుకుంటే అన్నింటికీ అనుమతి లభిస్తుందని అధికారులు తెలిపారు.



చికెన్ షాపులు వెలవెల !

బర్డ్‌ఫ్లూ ప్రభావంతో గత నెల నుంచి చికెన్ కొనుగోళ్లు తగ్గుతూ వస్తున్నాయి. దీంతో చికెన్ దుకాణాలు వెలవెలపోతుండగా చేపల షాపులు కళకళలాడుతున్నాయి. ఆదివారం చికెన్ షాపుల వద్ద కనీసం పట్టుమని పది మంది కూడా కనిపించని పరిస్థితి ఏర్పడింది. చికెన్ తింటే వ్యాధుల బారిన పడాల్సి వస్తుందేమోనన్న భయంతో ఆసక్తి చూపలేదు.

– సీతారామపురం, (ఆంధ్రజ్యోతి)

సోమశిలలో 56.646 టీఎంసీల నీరు

అనంతసాగరం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం పూర్తి సామర్థ్యం 97.988 టీఎంసీలు కాగా ఆదివారం నాటికి 56.646 టీఎంసీలు నిల్వ ఉంది. డెల్టాకు 1,150, ఉత్తర కాలువకు 550, దక్షిణ కాలువకు 350, కండలేరుకు 200 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

నేడు మత్స్య సంఘాలకు ఎన్నికలు

కలువాయి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దాచూరు, కలువాయి మత్స్యకారుల సంఘాలకు సోమవారం ఎన్నికలు జరగనున్నాయి. 390 మంది సభ్యులు ఉన్న దాచూరు మత్స్యకారుల సంఘానికి దాచూరులో ఎన్నిక నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి, కావలి మత్స్యశాఖ ఏడీ ఎస్ శ్రీనివాసులు తెలిపారు. అలాగే కలువాయి సంఘానికి 144 మంది సభ్యులు ఉండగా ఈ ఎన్నిక కలువాయి చెరువు సమీపంలోని మత్స్యకారుల సంక్షేమ సంఘం కమ్యూనిటీ హాలులో జరుగుతుందని ఎన్నికల అధికారి కోవూరు మండలం పడుగుపాడుకు ఎఫ్‌బీవో పి శ్రీనివాసులు తెలిపారు. కలువాయిలో రాపూరు, సైదాపురం పోలీసులు, దాచూరులో కండలేరు, రాపూరు పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు.

నడిరోడ్డుపై కొండ చిలువ

పొదలకూరు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని నందివాయి గ్రామ సమీపంలో ఆదివారం కొండచిలువ వాహనదారులను హడలెత్తించింది. సుమారు 7 అడుగుల పొడవు కలిగిన కొండచిలువ రహదారిపైకి రావడంతో వాహనదారులు భయాందోళనకు గురయ్యారు. రోడ్డుకు అడ్డంగా పాకుతూపోతున్న దానిని చూసిన స్థానికులు భయంతో వణికిపోయారు. కొండ చిలువ దానంతట అదే సమీపంలోని అడవిలోకి వెళ్లిపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు.

ఈతకెళ్లి పెన్నాలో బాలుడి మృతి

నెల్లూరు(క్రైం), మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పెన్నానదిలో ఈతకెళ్లి ఓ బాలుడు మృతి చెందాడు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని మనుమసిద్దినగర్‌కు చెందిన శరవణ్, కౌముది దంపతుల కుమారుడు సాయి కుమార్(14) లిటిల్ ఏంజెల్స్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. శనివారం ఇంట్లో ఎవరూ లేకపోవడంతో స్కూటీ తీసుకొని పెన్నా నది వద్దకు వెళ్లాడు. ఏటి పండుగ జరిగే ప్రాంతంలో దుస్తులు విప్పి స్కూటీపై పెట్టి నదిలోకి ఈతకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు నీటిలో గల్లంతయ్యాడు. కుమారుడు కనిపించకపోవడంతో తల్లిదండ్రులు చుట్టుపక్కల గాలించారు. ఆదివారం ఉదయం పెన్నాలో బాలుడి మృతదేహం ఉందనే సమాచారంతో సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. ఎస్ఐ బాలకృష్ణ కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం బాలుడి మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	92
లేయర్ లైవ్	90
స్కిన్ చికెన్	170
స్కిన్‌లెస్	190
లేయర్	153

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.8281
వెండి కిలో ధర	రూ. 99,500
వెండి ఒక గ్రాము	రూ.102.50

మొక్కజొన్న తోటలో... ముసిరిన చీకట్లలో...!

- అకట్టుకున్న జానపద నృత్యం
- గిన్నిస్ రికార్డు కోసం ఒకేసారి కాలు కదిపిన 1116 మంది కళాకారులు
- నగరంలో వినూత్న కార్యక్రమం
- నృత్యకళాకారుడు నారాయణమూర్తికి అవార్డుల ప్రదానం

నెల్లూరు (సాంస్కృతికం) మార్చి 9 (ఆంధ్రజ్యోతి): జయహో జానపదం... జయహో జానపదం.. అంటూ నగరంలోని ఏసీ స్టేడియంలో ఆదివారం ప్రేక్షకులు కేరింతలు 'మొక్కజొన్న తోటలో... ముసిరిన చీకట్లలో... అనే గీతానికి 1,116 మంది చిన్నారులు జానపద నృత్యం ప్రదర్శించారు. తిలకించిన ప్రేక్షకులు పులకించి పోయారు. జానపద నృత్య కళాకారుడు, డ్యాన్స్ మాస్టర్ నారాయణమూర్తి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మూడు నెలల పాటు అన్నీ మున్సిపల్ పాఠశాలల విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఆదివారం 1116 మంది విద్యార్థులు అద్భుత ప్రదర్శన ఇచ్చారు. ఈ ప్రదర్శనను గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు ప్రతినిధులతోపాటు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డు, జీనియస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు, గోల్డెన్ స్టార్ వరల్డ్ రికార్డుల ప్రతినిధులు పరిశీలించారు. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డును 30 రోజుల్లో ఇస్తామని ఆ ప్రతినిధి తెలిపారు. మిగిలిన ఐదు వరల్డ్ రికార్డుల సంస్థల ప్రతినిధులు డ్యాన్స్ మాస్టర్ నారాయణమూర్తికి మెడల్స్, రికార్డులు ప్రదానం చేశారు. అనంతరం నారాయణమూర్తి మాట్లాడుతూ ఈ అవార్డులను తమ తల్లిదండ్రులకు, భారత్ జవాన్లకు అంకితం ఇస్తున్నామని ప్రకటించారు. కలెక్టర్ ఓ.ఆనంద్ సహకారంతోపాటు అన్నీ ప్రభుత్వ శాఖలు, విద్య, వైద్యశాఖలు 10 మంది హైస్కూలు హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఈ కార్యక్రమం నిర్వహణ బాధ్యతలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గీతాంజలి, శ్రేయ గ్రూప్ అధినేత అగస్టన్, డీఈవో బాలాజీరావుతోపాటు పలువురు సహకారం అందించారు.



నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు



అవార్డులు అందుకున్న నృత్యకళాకారులు

వివాహిత ఆత్మహత్య

● భర్త వేధింపులే కారణమని తల్లి ఫిర్యాదు

నెల్లూరు(క్రైం), మార్చి 9 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని పొర్లుకట్ట ప్రాంతంలో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల సమాచారం మేరకు... కందుకూరుకు చెందిన షేక్ నమీనా(37)కు పొర్లుకట్టకు చెందిన మున్వర్‌తో కొన్నేళ్ల క్రితం వివాహం చేశారు. వారికి మహిరా, అక్బర్ సంతానం. మున్వర్ 2016లో రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అప్పటి నుంచి నమీనా నగరంలోని ఓ జెరాక్స్ షాప్‌లో పనిచేస్తూ పిల్లలను పోషిస్తోంది. పొర్లుకట్టలోనే నివాసం ఉంటున్న మున్నా వివాహమై భార్య నుంచి విడిపోయాడు. ఈ క్రమంలో నమీనాకు మున్నాతో పరిచయమైంది. పిల్లల్ని బాగా చూసుకుంటానని తనను వివాహం చేసుకోవాలని మున్నా కోరడంతో అతని మాటలు నమ్మిన ఆమె తల్లిదండ్రుల అంగీకారంతో 2017లో వివాహం చేసుకుంది. కొద్ది రోజులు వారి కాపురం సంతోషంగా సాగినా ఆ తర్వాత పిల్లల విషయంలో తరచూ గొడవ పడుతుండేవారు. మున్నా ఇతర మహిళలతో సన్నిహితంగా ఉంటూ ఇంటికి రావడం తగ్గించాడు. ఇదిలా ఉండగా నమీనా పొదుపులో రూ.4లక్షల రుణం తీసుకుని భర్తకు ఇచ్చింది. రుణం విషయంలో ఈ నెల 8వ తేదీ వారి మధ్య గొడవ జరిగింది. ఆ తర్వాత మున్నా ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఆదివారం తెల్లవారుజామున భార్యకు వీడియో కాల్ చేసి మాట్లాడాడు. ఆ తర్వాత ఏం జరిగిందో ఏమో తెలియదుగానీ నమీనా ఇంట్లోనే చీరతో ఉరివేసుకుంది. ఇది గమనించిన ఆమె కుమారుడు పెద్దగా కేకలు వేయడంతో స్థానికులు అక్కడకు చేరుకొని నమీనాను రామచంద్రారెడ్డి వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో విషయాన్ని నమీనా తల్లి బీబీజాన్‌కు తెలిపారు. ఆమె నెల్లూరుకు చేరుకుని భర్త వేధింపులే తన కుమార్తె మృతికి కారణమంటూ సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ సుల్తాన్‌బాషా కేసు నమోదు చేశారు. నమీనా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు.



55 ఏళ్ల తర్వాత అపూర్వ కలయిక

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఆర్‌ఎస్‌ఆర్‌ఎం హైస్కూల్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం నెల్లూరు క్లబ్‌లో జరిగింది. వీరంతా ఆర్‌ఎస్‌ఆర్‌ఎంలో 12వ తరగతి చదువుకున్నారు. అందరూ ప్రస్తుతం 72 సంవత్సరాల పైబడిన వారు కావడం విశేషం. ఆనాటి సంగతులను నెమరువేసుకుని సంతోషాన్ని పంచుకున్నారు. నాటి గురువులు పీవీ శేషయ్య, పీ వెంకటరెడ్డి (95 సంవత్సరాలు పైబడిన)ని సత్కరించారు. ఈ కార్యక్రమాన్ని నాటి విద్యార్థులు వెంకయ్య నాయుడు, జాన్, బర్నీ, సుధాకర్, సుబ్బయ్య పర్యవేక్షించారు.

సీపీడబ్ల్యూఏ సేవలు ప్రశంసనీయం

● ఏపీ వక్ఫ్‌బోర్డ్ రాష్ట్ర చైర్మన్ అబ్దుల్ అజీజ్

నెల్లూరు (వైద్యం), మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో కమ్యూనిటీ పారామెడికల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుల వైద్య సేవలు ప్రశంసనీయమని వక్ఫ్ బోర్డు రాష్ట్ర చైర్మన్ అబ్దుల్ అజీజ్ అన్నారు. ఆదివారం నగరంలోని ఓ హోటల్‌లో ఆ అసోసియేషన్ 8వ వార్షికోత్సవం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న అజీజ్ మాట్లాడుతూ 2017లో గ్రామీణ వైద్య సేవలకు ప్రత్యేక గుర్తింపు ఇవ్వాలన్న ఉద్దేశంతో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఓ జీవో విడుదల చేసిందన్నారు. అయితే వైసీపీ అధికారంలోకి రాగానే ఆ జీవోను విస్మరించిందని విమర్శించారు. గ్రామీణ వైద్యులుగా చలామణి అవుతున్న సీపీడబ్ల్యూఏ సభ్యులకు గుర్తింపు ఇవ్వాల్సి ఉందని, ఆ దిశగా ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం కృషి చేస్తుందని వెల్లడించారు. ఖాజామియ్యా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ సిరాజ్, భానుకిరణ్, చాన్‌బాషా, ఖాజా మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వక్ఫ్ బోర్డు రాష్ట్ర చైర్మన్ అబ్దుల్ అజీజ్

రాష్ట్ర కార్యవర్గంలోకి జిల్లా ఎక్సైజ్ అధికారులు

నెల్లూరు(క్రైం), మార్చి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎగ్జిక్యూటివ్ అధికారుల సంఘం నూతన కార్యవర్గానికి జిల్లాకు చెందిన ఇద్దరు ఎస్‌ఐలు ఎంపికయ్యారు. విజయవాడలో ఆదివారం జరిగిన రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం అయింది. జనరల్ సెక్రటరీగా ఎక్సైజ్ నెల్లూరు-1 స్టేషన్ ఎస్‌ఐ ఎస్ ప్రభాకర్‌రావు, జోనల్ కార్యదర్శిగా ఇందుకూరుపేట ఎక్సైజ్ స్టేషన్ సీఐ జీవీ ప్రసాద్‌రెడ్డి ఎంపికయ్యారు.



రాష్ట్ర కార్యవర్గానికి ఎన్నికైన జిల్లా అధికారులు

పత్తి రవీంద్రబాబుకు నివాళి

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : సీనియర్ వ్యాపారవేత్త, రాజకీయ నాయకుడు, తల్పగిరి రంగనాథస్వామి ఆలయ మాజీ చైర్మన్, కొచ్చిన్ గోవా పోర్టు ట్రస్ట్ మాజీ చైర్మన్ పత్తి రవీంద్రబాబుకు పలువురు నివాళి అర్పించారు. ఆయన శనివారం రాత్రి మృతి చెందారు. దేవదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డితోపాటు పలువురు ప్రజా ప్రతినిధులు సంతాపం ప్రకటించారు. రవీంద్రబాబు అందించిన సేవలను కొనియాడారు. రవీంద్రబాబు అంతిమయాత్ర సోమవారం ఉదయం నగరంలోని స్వగృహం నుంచి మొదలవుతుందని ఆయన కుమారుడు పత్తి సీతారామ్‌బాబు తెలిపారు.

వివాద రహితంగా విలీన ప్రక్రియ చేపట్టాలి

● విద్యాశాఖ అధికారులతో కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

నెల్లూరు (హరనాథపురం), మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : కోవూరు నియోజకవర్గంలో వివాద రహితంగా పాఠశాలల విలీన ప్రక్రియ చేపట్టాలని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సూచించారు. నగరంలోని వీపీఆర్ నివాసంలో ఆదివారం కోవూరు నియోజక పరిధిలోని విద్యా శాఖ అధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులతో ఆమె సమీక్ష జరిపారు. పాఠశాలల విలీనానికి సంబంధించి వస్తున్న అభ్యంతరాలను అధికారులు ఆమె దృష్టికి తెచ్చారు. తల్లిదండ్రులు, అధికారుల అభిప్రాయాలను తెలుసుకున్న ఆమె విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా వివాద రహితంగా విలీన ప్రక్రియ చేపట్టాలని, అవసరమైతే విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లి కోవూరు నియోజకవర్గ పరిధిలో ప్రస్తుతం వున్న 345 పాఠశాలల సంఖ్యను పెంచేందుకు కృషి చేస్తానని చెప్పారు. జిల్లా ఉప విద్యాశాఖాధికారి వెంకటేశ్వర నాయక్, బుచ్చి మున్సిపల్ చైర్ పర్సన్ మోర్ల సుప్రజ, టీడీపీ నాయకులు బత్తుల హరికృష్ణ, మంగమూరు, శ్రీహరిరెడ్డి, బెజవాడ వంశీ కృష్ణారెడ్డి, జనసేన నాయకులు చప్పిడి శ్రీనివాసులురెడ్డి, మోర్ల మురళి పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

ఆహార నియమాలతో గుండెపోటు దూరం

● డాక్టర్ భక్తవత్సలరెడ్డి

నెల్లూరు(విద్య), మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : ఆహార నియమాలు పాటిస్తూ, దుర్వసనాలకు దూరంగా ఉంటే గుండెపోటును నివారించవచ్చని ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ భక్తవత్సలరెడ్డి తెలిపారు. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఆదివారం వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైద్య సదస్సు నిర్వహించారు. ఆయన పాల్గొని వైద్య సలహాలు ఇచ్చారు, వాకర్స్ సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు చింతల అమరేంద్రరెడ్డి, కార్యదర్శి పొన్నం రవిచంద్ర, కోశాధికారి జీకే గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మాగుంట లే అవుట్ ఎస్‌ఆర్‌కే విశ్వసాయి స్కూలులో ఆదివారం నవ్యాంధ్ర రచయితల సంఘం మహిళా దినోత్సవం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం పొలిటికల్ సైన్స్ డిపార్ట్‌మెంట్ విశ్రాంత ప్రొఫెసర్ అక్కిరాజు శమంతకమణిని సత్కరించారు. ఈ కార్యక్రమానికి నవ్యాంధ్ర రచయితల సంఘం అధ్యక్షురాలు గోవిందరాజుల సుభద్రాదేవి అధ్యక్షత వహించారు. నెరసం రాష్ట్ర కార్యదర్శి పాతూరి అన్నపూర్ణ, పలువురు రచయితలు పాల్గొన్నారు.

భార్య మృతిని తట్టుకోలేక ఆత్మహత్య

నెల్లూరు(క్రైం), మార్చి 9 (ఆంధ్రజ్యోతి): భార్య మృతిని తట్టుకోలేక ఆత్మహత్యకు యత్నించిన భర్త ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని మూలాపేట రాజీవ్ గృహకల్పలో పీ వేణుగోపాల్(60), లక్ష్మీదేవి దంపతులు నివసిస్తున్నారు. వారికి ఇద్దరు సంతానం. గతేడాది డిసెంబరులో లక్ష్మీదేవి మృతిచెందింది. పిల్లలు ఇద్దరు చెన్నై, హైదరాబాదులో ఉండటంతో వేణుగోపాల్ ఒంటరిగా జీవిస్తున్నాడు. భార్య మృతిని జీర్ణించుకోలేక మానసికంగా కుంగిపోయాడు. ప్రతి రోజు పిల్లలకు ఫోన్‌చేసి మాట్లాడేవాడు. కానీ ఈ నెల 7న పిల్లలు ఫోన్ చేసినా తీయకపోవడంతో వారు శనివారం నెల్లూరుకు చేరుకున్నారు. ఇంటిలో తండ్రి స్పృహకోల్పోయి ఉండటంతో జీజీహెచ్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. వేణుగోపాల్ ఆత్మహత్యకు యత్నించినట్లు వైద్యులు తెలిపారు. కుమారుడు తరుణ్ ఫిర్యాదుతో చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇంటింటికి సీపీఎం ప్రజాచైతన్య యాత్ర

నెల్లూరు (వైద్యం), మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : సీపీఎం చేపట్టిన ప్రజాచైతన్య యాత్ర ఆదివారం 54వ డివిజన్‌లో జరిగింది. పార్టీ నాయకులు జనార్దన్‌రెడ్డి కాలనీ, లక్ష్మీపార్వతి నగర్‌లో ఇంటింటికి తిరిగి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ జనార్దన్‌రెడ్డి కాలనీలో 32 ఏళ్ల నుంచి నివాసం ఉంటున్నా అక్కడి వారి ఇళ్లకు ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చేయడం లేదని ఆరోపించారు. పెన్నానది పక్కనే ఉన్నప్పటికీ ఇక్కడ కొళాయిల్లో కలుషిత నీరు వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. వెంకటేశ్వరపురంలో ప్రభుత్వ బ్యాంకును పునరుద్ధరించాలని, విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మించాలని, షాదీ మంజిల్ పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నగర కార్యవర్గ సభ్యులు నాగేశ్వరరావు, మూలం ప్రసాద్, షేక్ జాఫర్, గడ్డం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజాచైతన్య యాత్రలో సీపీఎం నాయకులు

నేడు డయల్ యువర్ డీఎం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మార్చి 9 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు ఆర్టీసీ-1వ డిపో పరిధిలో ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు సూచనలు, సలహాల కోసం సోమవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని డిపో మేనేజర్ మురళీకృష్ణ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని, ఆసక్తి ఉన్న వారు 9959225641 నెంబరుకు ఫోన్ చేయాలని కోరారు.

ఉత్సాహంగా 'కృష్ణచైతన్య' క్రీడలు

నెల్లూరు(విద్య), మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : కృష్ణ చైతన్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ క్రీడలు ఆదివారం కాకుటూరులోని కళాశాల ప్రాంగణంలో ఉత్సాహంగా జరిగాయి. విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఆర్‌వీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువులో ఉత్తమంగా రాణించేందుకు, వారిలో మరింత ఉత్సాహం నింపేందుకు పోటీలు నిర్వహించామన్నారు. క్రీడలతో నూతనోత్సాహాన్ని పొంది రానున్న పరీక్షల్లో విజయం సాధించాలని పిలుపు నిచ్చారు. అనంతరం క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, షటిల్, వన్‌మినిట్ క్రీడల్లో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ పర్వతరెడ్డి రాణా ప్రమోద్‌రెడ్డి, డీన్ జ్యోతి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం ప్రసాద్, హెచ్‌వోడీ ఫణికుమార్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



పోటీల్లో తలపడుతున్న విద్యార్థులు

కసుమూరులో భక్తుల సందడి

వెంకటాచలం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కసుమూరు మస్తాన్‌వలీ దర్గాలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. తమిళనాడు, కేరళ, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలతోపాటు మన రాష్ట్ర నలమూల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి మస్తాన్ స్వామిని దర్శించుకున్నారు. కొందరు భక్తులు స్వామి వారికి తలనీలాలు సమర్పించగా మరికొందరు అన్నదాన కార్యక్రమాలు చేపట్టి తమ మొక్కులు తీర్చుకున్నారు. ఈసందర్భంగా దర్గాకు పూలు, విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు సరైన వసతి సౌకర్యాలు కల్పించడంలో వక్ఫ్‌బోర్డు శాఖ విఫలమైంది. దీంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదురుకున్నారు.

మోటర్ బైక్‌ను ఢీకొన్న ఆటో

● ఇద్దరికి గాయాలు

వెంకటాచలం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కసుమూరు పంచాయతీ జ్యోతి నగర్ సమీపంలో ఉన్న మలుపు వద్ద ఆదివారం మోటర్ బైక్‌ను ఆటో ఢీకొంది. వివరాల మేరకు.. నెల్లూరు నగరంలోని కిసాన్ నగర్ ప్రాంతానికి చెందిన బాబు, ఇబ్రహీమ్ బైక్‌పై దైవదర్శనం కోసం కసుమూరు దర్గాకు వెళ్లి తిరిగి నెల్లూరుకు వెళ్తుండగా జ్యోతినగర్ సమీపంలో ఉన్న మలుపు వద్దకు వచ్చేసరికి వెంకటాచలం నుంచి కసుమూరు వైపు వెళ్తున్న ఓ ఆటో ఢీకొంది. దీంతో బైక్ అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఒకరు తీవ్రంగా, మరొకరు స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం వెంకటాచలం సీహెచ్‌సీకి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గాంధీ ఆశ్రమంలో సర్వమత ప్రార్థనలు

ఇందుకూరుపేట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పల్లిపాడు పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో ఆదివారం సర్వమత ప్రార్థనలు జరిగాయి. ఆశ్రమ కమిటీ సభ్యులు గంపల మంజుల, రాదయ్యలు మహాత్మాగాంధీ విగ్రహానికి ఖాదీ వస్త్రాలు, నూలు మాలలు సమర్పించారు. ఆశ్రమ స్థల దాత పొణక కనకమ్మ విగ్రహానికి పట్టువస్త్రాలు, నూలుమాలలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ మేనేజర్ మనోజ్, స్కూల్ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలుచుకున్న వారు, ప్రస్తుత చందాదారులకు పత్రిక పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ కింది ఫోన్ నెంబర్‌ను సంప్రదించగలరు.

నెల్లూరు ఏసీఎం - 9985411424

కోవూరు పోలీస్ స్టేషన్‌కు కొత్త భవనం

● ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

కోవూరు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): కోవూరు పోలీస్ స్టేషన్‌కు సొంత నిధులతో కొత్త భవనం నిర్మిస్తామని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్ ఆవరణలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడు తూ 120 ఏళ్ల క్రితం నిర్మించిన పోలీసుస్టేషన్ భవనం శిథిలావస్థకు చేరిందన్నారు. పోలీసు ఉన్నతాధికారులు భవనాన్ని నిర్మాణానికి అనుమతులు తీసుకోవాలని కోరారు. ప్రజలకు రక్షణ కల్పిస్తున్న పోలీసులకు అవసరమైన వాహనా లు, సీసీ కెమెరాలు తమ సంస్థ ద్వారా అందించేందుకు సిద్ధంగా ఉంటామన్నారు. జిల్లాలో శాంతి భద్రతల విష యంలో ఎస్పీ కృష్ణకాంత్ కృషి అభినందనీయమన్నారు. గంజాయి వినియోగంపై ఉక్కు పాదం మోపి సంఘ విద్రోహక చర్యల్ని అడ్డుకోవడం సంతోషదాయకమని చెప్పారు. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమపాళ్లలో అందిస్తున్నారన్నారు. ఎస్పీ జీ. కృష్ణకాంత్ మాట్లాడుతూ పోలీసులకు వీపీఆర్ ఇన్‌ఫ్రా సంస్థ ద్వారా మూడు వాహనాలను బహూకరించడం ఆనందంగా ఉందన్నారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి దాతృత్వం అభినందనీయమన్నారు.



ఎస్పీ కృష్ణకాంత్‌కు వాహన తాళం అందజేస్తున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

● రూ.70 లక్షల చెక్కుల పంపిణీ

వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న 60 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.70లక్షల చెక్కులను ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు, సీఐ సుధాకర్‌రెడ్డి, ట్రైనీ డీఎస్పీ శివప్రియ, ఎస్‌ఐ రంగనాథ్ గౌడ్, నెల్లూరు కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, ఎంపీపీ తుమ్మలపెంట పార్వతి, పెన్నా డెల్టా చైర్మన్ జెట్టి రాజగోపాలరెడ్డి, కోవూరు, వేగూరు సర్పంచులు యాకసిరి విజయ, అమరావతి, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కామాక్షితాయి సేవలో సీనియర్ సివిల్ న్యాయాధికారి

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): జిల్లా మొదటి అదనపు సీనియర్ సివిల్ న్యాయాధికారి ఎన్.శ్రీనివాస్ దంపతులు ఆదివారం జొన్నవాడ మల్లికార్జునస్వామి, కామాక్షితాయిలను దర్శించుకు న్నారు. అర్చకులు, సిబ్బంది వారికి ఆలయ సాంప్ర దాయాలతో స్వాగతించారు. గోత్రనామములతో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అదజేసి శేషవస్త్రాలతో సత్కరించారు. కాగా ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు.



సీనియర్ సివిల్ న్యాయాధికారి దంపతులకు ప్రసాదాలు అందజేస్తున్న ఆలయ సిబ్బంది

సీపీఎం ప్రజా చైతన్య యాత్ర

ముత్తుకూరు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): పంటపాలెంలో ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గడ్డం అంకయ్య మాట్లాడుతూ గ్రామాల్లో పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేసేందుకు ఈ యాత్రలను నిర్వహిస్తున్నామని తెలిపారు. పంటపాలెం పరిసర గ్రామాల్లో కాలుష్య ప్రభావం అధికంగా ఉందన్నారు. గత ప్రభుత్వం పాటించిన వైఫల్య విధానాలనే ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం అవలంబిస్తోందని విమర్శించారు. నిరుద్యోగ సమస్య, కంటైనర్ టెర్మినల్ సమస్య, మత్స్యకారేతర ప్యాకేజీ మిగులు చెల్లింపులు అలాగే ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు నక్కా రాధయ్య, షేక్.మస్తాన్, చేవూరు మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.



ప్రజాచైతన్య యాత్రలో పాల్గొన్న సీపీఎం నాయకులు

పుట్టాలమ్మకు ప్రత్యేక పుష్పాలంకరణ

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని రేబాలలో గ్రామదేవత పుట్టాలమ్మకు 3 ఆదివారాలు, చలిపిండి, పానకాలు, 3 మంగళవారాలు చద్ది సమర్పించే కార్యక్రమంలో భాగంగా తొలిరోజు చలిపిండి, పానకాలు సమర్పించారు. ఈ సందర్భంగా పుట్టాలమ్మ ప్రత్యేక పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మంగళవారం చద్ది నివేదనలు సమర్పించనున్నట్లు ఆలయ నిర్వాహకుడు టీ.వెంకటరామిరెడ్డి తెలిపారు.

టీడీపీలో నేతల మధ్య వివాదం

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇస్కపాళెంలో టీడీపీకి చెందిన ఓ నాయకుడు అదే పార్టీకి, మరో పార్టీకి చెందిన కొక్కిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, భైనబోయిన శ్రీనివాసులు యాదవ్‌ను బెదిరించి వారి నుంచి బైక్‌ను లాక్కున్నాడని ఆదివారం ఆ ఇద్దరు నాయకులు 100కు కాల్ చేశారు. సాయంత్రం బుచ్చి పోలీస్‌స్టేషన్‌లోనూ ఫిర్యాదు చేశారు. దీంతో ఇద్దరు పోలీసులు ఇస్కపాళెంలోని బాధితుల ఇంటి వద్ద ఎలాంటి గొడవలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు. బాధితుల ఫిర్యాదు మేరకు గొడవలు తలెత్తకుండా చూస్తామని సీఐ శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

హాస్టల్ విద్యార్థులకు స్టడీ చైర్స్ పంపిణీ



విద్యార్థులకు స్టడీ చైర్స్ పంపిణీ చేస్తున్న సత్యసాయి సేవా సమితి సభ్యుల

పొదలకూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఎస్సీ బాలుర, బాలికల, బీసీ బాలికల హాస్టళ్లలోని విద్యార్థినీ విద్యార్థులకు ఆదివారం గూడూరు పట్టణానికి చెందిన సత్యసాయి సేవా సమితి యువజన విభాగం ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు స్టడీ చైర్‌లు, పరీక్ష సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంస్థ యూత్ కోఆర్డినేటర్ ఎస్. శ్రీనివాస్, తిరుపతి జిల్లా మహిళా ఆధ్యాత్మిక కో ఆర్డినేటర్ గుడ్లూరు భవానీ మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు ఆత్మవిశ్వాసం, పాజిటివ్ థింకింగ్‌తో పరీక్షలు రాయాలని సూచించారు. పరీక్షల సమయంలో సరైన ఆహారం, సక్రమమైన నిద్ర, ఆరోగ్య చిట్కాలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో సమితి కన్వీనర్ కె.దాము ప్రతాప్, ప్రభుత్వ ఉపాధ్యాయిని ఏ.జ్యోతి, విజ్ఞాన్ కాలేజీ ప్రిన్సిపాల్ అన్నం సుబ్బారావు, ఆయా హాస్టళ్ల వార్డెన్లు పాల్గొన్నారు.

వైసీపీ నేత అక్రమాలు బయట పెడతాం

● ఎంపీటీసీ గరికపాటి రాజేంద్రకుమార్

కొడవలూరు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): నియోజక వర్గాన్ని గత ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రావెల్, మట్టి, ఇసుక, ధాన్యం, మాఫియాలకు అడ్డాగా మార్చిన ఓ వైసీపీ నాయకుడు నేడు ఎక్కడ తన ఉనికిని కోల్పోతాననే భయంతో వ్యక్తిగత ఆరోపణలు చేస్తున్నాడని, గతంలో ఆయన చేసిన అక్రమాలు బయట పెట్టి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని యల్లాయపాలెం ఎంపీటీసీ గరికపాటి రాజేంద్రకుమార్ హెచ్చరించారు. మండలంలోని పెమ్మారెడ్డిపాడులో ఆదివారం టీడీపీ నాయకులు నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆ వైసీపీ నాయకుడి అక్రమాలు ఎక్కడ బయటపెడతామోనన్న భయంతో తనపై అక్రమ కేసులు బనాయించి వేధించారని తెలిపారు. తనపై చేసిన వ్యక్తిగత ఆరోపణలు నిరూపించాలన్నారు. మండలస్థాయికి ఎక్కువ.. జిల్లాస్థాయికి తక్కువైన ఆ నాయకుడు తనస్థాయి మరిచి మాట్లాడితే తగిన గుణపాఠం చెబుతామన్నారు. ఈ సమావేశంలో నాయకులు టీ.ప్రవీణ్, భూలోకం విజయకుమార్, కేతు వెంకటరమణారెడ్డి, మందపాటి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, చెక్కా మదన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీటీసీ గరికపాటి రాజేంద్రకుమార్

అనారోగ్య బాధితుడి కుటుంబానికి ఆర్థికసాయం

పొదలకూరు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): స్థానిక నరసారెడ్డి కాలనీలో వెన్నెముక, న్యూరో సమస్యతో ఆరేళ్లుగా మంచానికే పరిమితమైన కూచిపాటి వరప్రసాద్ కుటుంబానికి యాదవ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రూ.16వేలు ఆర్థిక సాయం, రెండు బియ్యం కట్టలు అందజేశారు. కార్యక్రమంలో వైఈపీఏ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ మాదాల వెంకటేశ్వరరావు, రాష్ట్ర గౌరవ సలహాదారులు గంగుల మధుసూదన్‌రావు, రాష్ట్ర అధ్యక్షుడు గుర్రం నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు పెరుమాళ్ల కొండయ్య, పీలం సురేష్‌బాబు, సుంకు వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

హెచ్చరిక నోటీసు

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా నా క్లయింట్ అయిన **బత్తాన నాగభూషణం తండ్రి సుబ్బారాయుడు,** డోర్ నెం.27/2/1512, లక్ష్మీనగర్, బాలాజీనగర్, నెల్లూరు **నా క్లయింటు 2007 సంవత్సరములో ICICI బ్యాంకు మద్రాసు బస్టాండు అకౌంటు నెం. LBNEL00001500262 నెల్లూరు. ఎ.పి. బ్రాంచి వారి నందు బ్యాంకు లోన్ రుణం రూ॥లు 10,00,000 పొంది ఉన్నాడు. కాని నా క్లయింటు బ్యాంకు వారికి బకాయిలు డబ్బులు రూ॥లు 2,50,000 మరియు రూ॥లు 5,00,000 బ్యాంకు వారికి కట్టినాడు,** మిగతా పైకం మొత్తం బ్యాంకు వారికి కట్టడానికి పోతే బ్యాంకు వారు డబ్బులు కట్టించుకోవడం లేదు నా క్లయింటుకు సంబంధించిన ఈ క్రింది ఇంటి షెడ్యూలు ఆస్థిపై బ్యాంకు వారు గాని, ఇతరులు ఎవ్వరైన ఎటువంటి లావాదేవీలు జరిపిన యెడల అవి చట్టబద్ధముగా చెల్లనేరవు. అట్లు జరిపిన వారిపై నా క్లయింటు తీసుకొనబోవు సివిల్, క్రిమినల్ చర్యలకు బాధ్యులు అగుదురు.

ఆస్థి షెడ్యూలు

నెల్లూరు జిల్లా, నెల్లూరు సబ్ రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్ యిలాకా, నెల్లూరు సబ్ రిజిస్ట్రరు బిట్-2లో డోర్ నెం.27-2-1516 పాత, న్యూ డోర్ నెం.1512 లక్ష్మీనగర్, బాలాజీనగర్, పల్లిపాళెంలో చేరిన అడుగులు **(1.72 SQft) Or 2481.84 SQft** నెల్లూరు మున్సిపాల్ కార్పొరేషన్, **హద్దులు: ఉత్తరం:** ఖాళీ స్థలం, **దక్షిణం:** గోపాలయ్య స్థలం, **తూర్పు:** రోడ్డు, **పడమర:** పొలం మరియు దారి.

కౌంటర్ సంతకం **బత్తాన నాగభూషణం** సెల్: 7671069239

డి.రమణయ్య, BA., BL., అడ్వకేటు, నెల్లూరు. సెల్: 94416 85532

టీటీడీ ఉద్యోగిగా.. : 1978లో టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టులో గాయకుడిగా చేరిన గరిమెళ్ల 2006 వరకు సేవలందించారు. అన్నమాచార్య సంకీర్తనల స్వర కల్పన.. సంగీత స్వరాలతో కూడిన పుస్తకాల ముద్రణ.. రికార్డింగ్‌లో పాలుపంచుకున్నారు. ఈ ప్రాజెక్టు అదనంగా గరిమెళ్ల సంగీత పాండిత్యాన్నీ వెలుగులోకి తెచ్చింది. 2012 నుంచీ 2023 వరకూ టీటీడీ ఆస్థాన విద్వాంసుడిగా గౌరవానికి నోచుకున్నారాయన.

వినరో భాగ్యము

.. అంటూ వినువీధుల్లోకి

● మూగబోయిన గరిమెళ్ల మధురగళం

'వినరో భాగ్యము విష్ణు కథ..' అంటూ వేంకటపతి చరిత చెప్పిన స్వరం వైకుంఠం చేరింది.
'దాచుకో నీపాదాలకు దగనే జేసిన పూజలివి.. అంటూ శ్రీనివాసుడిని ఆర్తితో అర్చించిన గానం సప్తగిరులను ఆవహించింది.
టీటీడీ ఆస్థాన విద్వాంసుడు, మధుర గాయకుడు, అద్భుత స్వరకర్త గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్(76) ఆదివారం సాయంత్రం తిరుపతిలో గుండెపోటుతో కన్నుమూశారు. బుధవారం ఆయనకు అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ఆయన లేకున్నా.. ఆయన కీర్తనలు మాత్రం తెలుగు గడ్డపై వినిపిస్తూనే ఉంటాయని ప్రముఖులు నివాళులర్పించారు.









సంగీతానికి అంకితమైన పుంభావ సరస్వతిగా పేరు తెచ్చుకున్న గరిమెళ్ల 1948 నవంబరు 9న రాజమహేంద్రవరంలో జన్మించారు. ప్రఖ్యాత నేపథ్య గాయని ఎస్.జానకి ఆయనకు స్వయానా పిన్ని. నేదునూరి, పశుపతి, మంగళంపల్లి వీరికి గురువులైనప్పటికీ గరిమెళ్ల బాణీ.. ఈ ముగ్గురు త్రిమూర్తుల మేలు కలయిక అని సంగీతప్రియులు చెప్పుకుంటుంటారు. నేదునూరి వారిలోని రాగభావం, పశుపతి గాత్రంలోని శ్రుతిశుద్ధం, బాలమురళి వాణిలోని లాలిత్యం కలబోసిన బాణీ ఆయనది.

స్వరాలతో నవ్యశోధన : అన్నమయ్య చేసిన పదార్చనకు గరిమెళ్ల రాగాలు బంగారానికి తావి అనిపిస్తాయి. 150కి పైగా రాగాలను తీసుకొని, వెయ్యికుపైగా సంకీర్తనలకు వైవిధ్యభరితంగా బాణీలు కట్టిన ఘనత గరిమెళ్లది. ఆయన స్వరపరచిన అన్నమయ్య సంకీర్తన వింటుంటే, సాహిత్యం, దానికి తగ్గ సంగీతం జతగా కలసి మెలసి అన్నమయ్య మనతో మాటాడుతున్నారా అనిపిస్తుందంటే అతిశయోక్తిలేదు.

మోహన, హిందోళ, శుద్ధధన్యాసి వంటి రాగాలలో సాధారణంగా ఎవరు స్వరపరచినా పరిమితమైన అవే సంగతులు కనబడతాయి. కానీ గరిమెళ్ల ఒకదానికొకటి భిన్నమైన స్వరప్రయోగాలతో, సాహిత్యంలో ఒదిగిపోయే విధంగా స్వరం సమకూర్చటం విశేషం. ఔడవ (5 స్వరాల) రాగాలలోనే ఆయన అధిక భాగం స్వరపరిచారు. ఇక, ఆయన సృష్టించిన రాగాల విషయానికొస్తే సుందరరంజని, వాణీప్రియ, చిత్రకల్యాణి వంటి రెండుపదుల రాగాలను, వినూత్న భావావిష్కరణలకు ఆలవాలమయేట్లు ఆయన సృజించారు. ఇది ఆయన మరో నవ్యశోధన.

సంకీర్తన యజ్ఞ ప్రక్రియకు ఆద్యుడు

సంకీర్తన యజ్ఞ ప్రక్రియకు గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్‌ను ఆద్యుడిగా పరిగణిస్తారు. ఓ గాయకుడు ఒకే రోజు ఒకే వేదికపై అనేక కీర్తనలు ఆలపించడాన్ని సంకీర్తన యజ్ఞంగా పిలుస్తారు. 1997లో విశాఖలోను, 1999లో విజయవాడలోనూ ఆయన ఈ తరహా కార్యక్రమాలు నిర్వహించి 200కు పైగా కీర్తనలు ఆలపించారు. 2001లో తిరుపతిలో 300 కీర్తనలు పాడారు. 2003, 2007లలో హైదరాబాదులోనూ, 2008లో విజయవాడలోనూ, 2009లో హైదరాబాదులో, 2011లో కాకినాడలో, 2012లో తిరుపతిలో యజ్ఞ ప్రక్రియ కార్యక్రమాలు నిర్వహించి ఆయాచోట్ల 200కు పైగా కీర్తనలు ఆలపించారు.


భర్త భౌతికకాయం వద్ద విలపిస్తున్న రాధ

కొండపై ఏమూల ఉన్నా.. ఆయన గానం చెవిన పడాల్సిందే

గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ కీర్తి కిరీటంలో మరో కలికితురాయి బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ శివపదు కీర్తనలను స్వరపరచి ఆలపించడం కూడా. దాదాపుగా 150 శివపద కీర్తనలను స్వరపరచి ఆలపించారు. అవి నిజంగా ఆణిముత్యాలే. మధుర భావ తరంగాలే. ఆయన స్వరసహితంగా వెలువరించిన స్వీయ రచిత ఆంజనేయ కృతిమణిమాల, వినాయక కృతులు, నవగ్రహ కృతులు,'సర్వదేవతా స్తుతి రచనలు. ఇలా అనేకం బహుళ జనాదరణ పొందాయి. గరిమెళ్ళవారి గళం వినబడని ఆకాశవాణికేంద్రం లేదు. భక్తిరంజని కార్యక్రమం లేదు. దేశమంతటా పర్యటించి 'అన్నమయ్య నాదయజ్ఞాలు' ఎన్నో విజయవంతంగా నిర్వహించారు. ఆయన పలుకు ఎంత మంద్రమో గానమంత మార్దవం. అనవసర విన్యాసాలకు, ఆడంబర విద్వత్తు ప్రదర్శనలకు ఆయన దూరంగా ఉంటారు. తిరుమలకొండపై ఏమూల ఉన్నా, ఏ చోటనున్నా, గాలిఅలలపై తేలివచ్చే గరిమెళ్ళవారి గళం చెవికి సోకగానే, మధురానంద భరితుడవటం తథ్యం.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి


గరిమెళ్ల భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, సీపీఆర్వో రవి తదితరులు

గరిమెళ్లకు అనేక పురస్కారాలు

సంప్రదాయ కర్ణాటక సంగీతంలో విద్వాంసుడిగా పేరు మోసిన గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్‌ను పలు ప్రైవేటు, ప్రభుత్వ, ఆధ్యాత్మిక సంస్థలు పురస్కారాలతో గౌరవించాయి. ఆయనకు దక్కిన వాటిలో 2020లోని కేంద్ర సంగీక నాటక అకాడమీ పురస్కారం ముఖ్యమైనది. ఆయన అసాధారణ సేవలను గుర్తించి టీటీడీ వెండి పతకం, ప్రశంసా పత్రంతో సత్కరించింది. 2001లో టీటీడీ, లలిత కళా అకాడమీలు సంయుక్తంగా పురస్కారం ప్రదానం చేయగా 2007లో ఏపీ ప్రభుత్వం ఉగాది పురస్కారం ప్రకటించింది. 2009లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం మ్యుజీషియన్ ఆఫ్ ది ఇయర్ విశిష్ట పురస్కారం.. 2010లో చెన్నైకి చెందిన రాజ్యలక్ష్మి ఫౌండేషన్ పురస్కారం ప్రకటించాయి.

గాయని, పిన్ని అయిన ఎస్.జానకితో బాలకృష్ణ ప్రసాద్


తెప్పపై శ్రీరామచంద్రమూర్తి



తిరుమలలో ఆదివారం సాయంత్రం శ్రీవారి తెప్పోత్సవాలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు.. సీతాలక్ష్మణ ఆంజనేయస్వామి సమేత శ్రీరామచంద్రమూర్తి ఉత్సవర్లను మాడవీధుల ఊరేగింపుగా తీసుకొచ్చి పుష్కరిణిలోని తెప్ప పై ఆశీనులను చేశారు. మూడుచుట్లు విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



రుయాలో గంటపాటు అంధకారం

- ముందే చెప్పి సరఫరా ఆపిన డిస్కం అధికారులు
- జనరేటర్‌ను సిద్ధం చేసుకోవడంలో ఆస్పత్రి వర్గాల వైఫల్యం
- వెంటిలేటర్లపై రోగుల అవస్థలు


తిరుపతి(వైద్యం), మార్చి 9 (ఆంధ్రజ్యోతి): రుయాలో ఆదివారం ఉదయం గంటపాటు విద్యుత్తు సరఫరాలేక అంధకారం నెలకొంది. కరెంటు సరఫరా నిలిపివేస్తున్నట్లు ముందే చెప్పినా జనరేటర్‌ను సిద్ధం చేసుకోవడంలో అధికారులు విఫలమవడంతో ఈ పరిస్థితి నెలకొంది. ఆ సమయంలో అత్యవసర విభాగంలో చికిత్స పొందుతున్న.. వెంటిలేటర్లపై ఉన్న రోగులు ఇబ్బంది పడ్డారు. వివరాలిలా ఉన్నాయి. విద్యుత్తు మరమ్మతుల నేపథ్యంలో ఉదయం 9 గంటలకు సరఫరాను నిలిపేస్తున్నట్లు రుయాస్పత్రిలోని విద్యుత్తు విభాగ సిబ్బందికి శనివారం సమాచారం ఇచ్చారు. ఆ వెంటనే ఆస్పత్రిలో జనరేటర్‌ను సిద్ధం చేసుకోవాల్సిన విద్యుత్తు సిబ్బంది ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టలేదు. జనరేటర్ మరమ్మతులకు గురైన విషయాన్నీ రుయా అధికారుల దృష్టికి తీసుకెళ్లలేదు. ఆదివారం ఉదయం 9 గంటలకు సరఫరా ఆగడంతో ఆస్పత్రి అంధకారంతో నిండిపోయింది. అరగంట గడిచినా అత్యవసర విభాగం, ఐసీయూ, ఆపరేషన్ థియేటర్ వంటి వార్డుల్లో విద్యుత్తు సరఫరా లేకపోవడంతో రోగుల పరిస్థితి గందరగోళంగా మారింది. ఈ విషయాన్ని వార్డుల్లోని సిబ్బంది రుయా అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో వారు ఆస్పత్రికి చేరుకున్నారు. జనరేటర్ మరమ్మతులకు గురై ఉండటంతో విద్యుత్తు సరఫరా నిలిచిన వెంటనే సరఫరా చేయడానికి వీలు కాలేదని రుయాలోని విద్యుత్తు సిబ్బంది అధికారులకు వివరించారు. విద్యుత్తు సరఫరా నిలిచిపోతుందని ముందుగానే తెలిసినా ఎందుకు జనరేటర్‌ను సిద్ధం చేసుకోలేదని సూపరింటెండెంట్ రవిప్రభు సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.జనరేటర్ పనిచేయడం లేదనే విషయాన్ని తమ దృష్టికి ఎందుకు తీసుకురాలేదని మండిపడ్డారు. అప్పటికే పలు వార్డులో వెంటిలేటర్లపై ఉన్న రోగుల పరిస్థితి గందరగోళంగా మారడంతో అక్కడి సిబ్బంది,డాక్టర్లు ఆ విషయాన్ని సూపరింటెండెంట్ దృష్టికి తీసుకువచ్చారు. అప్పటికప్పుడే జనరేటర్‌కు మరమ్మతులు చేపట్టి పది గంటలకు సరఫరాను పునరుద్ధరించారు.

ఆ గంటలో ఇద్దరు శిశువుల మృతి!

ఆదివారం ఉదయం 9-10 గంటల మధ్య, విద్యుత్తు సరఫరా లేని సమయంలో రుయాలోని చిన్నపిల్లల విభాగంలో వెంటిలేటర్‌పై ఉన్న ఇద్దరు శిశువులు మృతి చెందినట్లు సమాచారం. ఈ విషయం తెలుసుకున్న అధికారులు చిన్నపిల్లల విభాగానికి చేరుకొని మృతిచెందిన శిశువులను పరిశీలించాక.. మిగతా వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఈ శిశువుల మృతి అనారోగ్యం వల్లే కానీ.. కరెంటు లేక కాదని వైద్యవర్గాలు అంటున్నాయి.

మద్యం మత్తులో బాబాయి, అబ్బాయి ఘర్షణ

● రోకలితో తలపై మోదడంతో అబ్బాయి మృతి


మణికంఠ (ఫైల్ ఫొటో)

పుత్తూరు అర్బన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో జరిగిన చిన్నపాటి గొడవ హత్యకు దారితీసింది. ఈ ఘటన ఆదివారం మధ్యాహ్నం పుత్తూరు పరిధిలోని చినరాజుకుప్పంలో జరిగింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. అన్నదమ్ములైన సుబ్బరాయుడు, వెంకటేష్ పక్కపక్క ఇళ్లలోనే ఉంటున్నారు. సుబ్బరాయుడి కుమారుడు మణికంఠ తిరుపతిలోని ఓ బార్‌లో పని చేస్తున్నాడు. ఆదివారం కావడంతో చిన్నాన్నతో కలిసి ఆయన ఇంట్లోనే మద్యం తాగారు. ఆ మత్తులో గొడవపడ్డారు. ఈ ఘర్షణలో వెంకటేష్ రోకలితో మణికంఠ తలపై బలంగా మోదాడు. తీవ్ర రక్తస్రావం కావడంతో ఘటనా స్థలంలోనే మణికంఠ అపస్మారకస్థితికి చేరుకున్నాడు. ఎంతకీ కొడుకు రాకపోవడంతో అతడి తల్లి పక్కనే ఉన్న ఇంటికెళ్లి వెళ్లి చూసింది. వెంకటేష్ మద్యం మత్తులో తూలుతుండగా, కొడుకు ఉలుకూపలుకూ లేకుండా రక్తంలో పడి ఉండడంతో గ్రామస్థుల సాయంతో 108 అంబులెన్స్‌కు సమాచారం అందించింది. సంఘటనా స్థలానికి చేరుకున్న అంబులెన్స్ సిబ్బంది మణికంఠను పరీక్షించి మృతి చెందినట్టు ధృవీకరించారు. మణికంఠపై దాడికి గల కారణాలు తెలియాల్సి ఉంది. మణికంఠకు భార్య జనని, రెండేళ్ల కొడుకు ఉన్నాడు. ప్రస్తుతం ఆమె గర్భిణి. వయసు మీరిన తల్లిదండ్రులకు, కుటుంబానికి మణికంఠ సంపాదనే ఆధారం. తన భర్త మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రి వద్ద జనని భోరున విలపించింది. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడు వెంకటేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (సోమవారం) : 6.25
సహరి (మంగళవారం) : 5.04

గ్రానైట్, ఇసుక మాఫియాపై విజి'లెన్స్'

తిరుపతి(నేరవిభాగం), మార్చి 9 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో సాగిన మైనింగ్, ఇసుక అక్రమాలపై విజిలెన్స్ దృష్టి పెట్టింది. అప్పట్లో పంచాయతీల అంగీకార తీర్మానాలూ లేవు. రాయల్టీగా రూపాయి కూడా చెల్లించలేదు. అధికారికంగా రెట్టింపు ప్రదేశంలో క్వారీ నిర్వహణకు, క్రషర్లకు అనుమతి లేకపోవడం.. క్రషర్ నుంచి వెళ్లే లోడ్లకు జీఎస్టీ చెల్లించలేదన్న విమర్శలున్నాయి. కూటమి అధికారంలోకి వచ్చాక కొందరు నేతలతో సఖ్యతగా ఉంటూ, వారి సహకారంతో అక్రమ మైనింగ్ సాగిస్తున్నారన్న విమర్శలున్నాయి. దీనిపై ఒకరిద్దరు ప్రజాప్రతినిధులు.. మరికొందరు ప్రభుత్వ పెద్దలకు, విజిలెన్సు ఎన్‌ఫోర్సుమెంటు అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. దీంతో ఈ వ్యవహారంపై దృష్టి పెట్టారు. నాయుడుపేట, సత్యవేడు, తిరుపతి రూరల్, సూళ్లూరపేట వంటి ప్రాంతాల్లో నిఘా వుంచి క్వారీల నుంచి రవాణా చేస్తున్న కంకర, ఇసుక అక్రమ రవాణా చేస్తున్న భారీ వాహనాలు ఆపి బిల్లులు తనిఖీ చేయనున్నారు. ఎక్కడ లోడింగ్ చేశారు? ఎక్కడికి తీసుకెళ్తున్నారు? అనుమతించిన ప్రాంతాల్లోనే నిర్వహిస్తున్నారా? అనే విషయాలపైనా లోతుగా ఆరా తీయనున్నారు.

కాలినడక భక్తులకు ఉపశమనం

● అలిపిరి మార్గంలో తాత్కాలిక పైకప్పు ఏర్పాటు

తిరుమల, మార్చి 9(ఆంధ్రజ్యోతి): అలిపిరి మార్గంలో నడక భక్తులకు వేసవి నుంచి ఉపశమనం కలిగింది. టీటీడీ తాత్కాలిక పైకప్పును ఏర్పాటు చేసింది. శ్రీవారి భక్తుల్లో 30 నుంచి 40 శాతం మంది ఈ మార్గంలోనే వస్తుంటారు. లక్ష్మీనరసింహస్వామి ఆలయం నుంచి మోకాలిమిట్ట వరకు దాదాపు 1.6 కిలోమీటర్ల మేర మొదటిఘాట్ రోడ్డు వెంబడే నడవాలి. కాలినడక మొక్కుకావడంతో పాదరక్షలు లేకుండానే భక్తులు వస్తుంటారు. దాదాపు కిలోమీటరు వరకు శాశ్వత షెడ్లు ఉన్నప్పటికీ మరో 600 మీటర్ల మేర ఎండకు కాలుతున్న రోడ్డుపైనే నడవాల్సి వస్తుంది. ఈ క్రమంలో టీటీడీ ఇంజినీరింగ్ విభాగం జర్మన్ షీట్లతో తాత్కాలిక పైకప్పును ఏర్పాటు చేసింది. దీంతో భక్తులకు వేసవి నుంచి కాస్త ఊరట లభిస్తోంది.



'యాంత్రీకరణ' కింద రైతులకు సబ్సిడీ యూనిట్లు

తిరుపతి(ఎంఆర్‌పల్లె), మార్చి 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రూ.282కోట్లతో యాంత్రీకరణ పథకం కింద రైతులకు 1,614 యూనిట్లు కేటాయించినట్లు జిల్లా వ్యవసాయాధికారి ప్రసాదరావు తెలిపారు. ఈమేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. బ్యాటరీ ఆపరేటర్ నాప్‌స్టాక్, పవర్ ఆపరేటర్ స్ప్రేయర్, ట్రాక్టర్ ఆపరేటర్ స్ప్రేయర్, ట్రాక్టర్ డ్రోన్ ఇంప్లిమెంట్, ఆరు లెవలింగ్ బ్లేడ్స్, రోటవేటర్స్, పవర్ విండోస్, బ్రష్ కట్టర్స్, పవర్ ఫిల్లర్స్ రైతులకు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. రైతు సేవా కేంద్రంలో వీటిని సబ్సిడీపై అందిస్తామన్నారు. మరింత సమాచారం కోసం రైతు సేవా కేంద్రాల్లోని అధికారులను సంప్రదించాలని సూచించారు.

ఆహార శుద్ధి యూనిట్లకు ప్రభుత్వ ప్రోత్సాహం

● పీఎంఎఫ్ఎంఈ కింద 35శాతం రాయితీ

తిరుపతి(ఎంఆర్‌పల్లె), మార్చి 9(ఆంధ్రజ్యోతి): ఆహారశుద్ధి యూనిట్లకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ జిల్లా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సతీష్ ఓ ప్రకటనలో తెలిపారు.ప్రభుత్వం 35శాతం రాయితీ, 55శాతం బ్యాంకు రుణం సమకూర్చుతుందన్నారు.ఉత్పత్తుల నాణ్యత ఆధారంగా మార్కెట్‌లో బ్రాండ్ సృష్టించుకునే అవకాశం ఉందని చెప్పారు. ఇప్పటికే యూనిట్లు ఉన్నా రుణం తీసుకుని విస్తరించుకోవచ్చన్నారు. పీఎంఎఫ్ఎంఈ పథకం కింద చిన్న మొత్తంలో యూనిట్లను ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. గరిష్టంగా రూ.10లక్షల వరకు రాయితీ పొందవచ్చునన్నారు. మరిన్ని వివరాల కోసం 77991 28020, 89782 92970 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు. పొదుపు సంఘాల మహిళలకు ఒక్కొక్కరికి రూ.40వేలు చొప్పున ఆర్థిక సాయం అందిస్తారు. ముడిసరుకు, ప్యాకింగ్, ఇతరాత్ర పెట్టుబడిగా ఉపయోగించుకుని తరువాత పొదుపు సంఘానికి చెల్లించాలి.వీరు కూడా 35 శాతం రాయితీపై రుణం తీసుకుని యూనిట్ విస్తరించుకోవచ్చు.జిల్లా, మండల స్థాయిలోని రిసోర్స్ పర్సన్స్ ద్వారా వివరాలు తీసుకోవచ్చు.18 ఏళ్లు నిండిన వారు యూనిట్ వివరాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలి. ఆధార్, పాన్ కార్డు, యూనిట్ చిరునామా పత్రం తదితర వివరాలను అప్‌లోడ్ చేయాలి.

బస్‌షెల్టర్ నిర్మించండి



బస్‌షెల్టరు లేకపోవడంతో ఎండలో నిరీక్షిస్తున్న గ్రామస్తులు

గూడూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంతదాసుపల్లి రోడ్డు వద్ద బస్‌షెల్టర్ లేకపోవడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. గూడూరు - మిటాత్మకూరు ప్రధాన రహదారి నుంచి సంతదాసుపల్లెకు అర్థ కిలోమీటరు దూరం వెళ్లాల్సి ఉంటుంది. సంతదాసుపల్లె నుంచి గూడూరు పట్టణానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో అర్థ కిలోమీటరు ప్రయాణించి ప్రధాన రహదారిపైకి చేరుకోవాలి. అక్కడ నుంచి మిటాత్మకూరు బస్సుల్లో గూడూరు చేరుకోవాల్సి ఉంటుంది. ప్రధాన రహదారిపై బస్‌షెల్టర్ లేకపోవడంతో ఎండ, వానతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి గూడూరు - మిటాత్మకూరు రహదారిపై సంతదాసు పల్లె రోడ్డు వద్ద బస్‌షెల్టర్ నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పేదల ఆరోగ్య రక్షణే ప్రభుత్వ ధ్యేయం



చెక్కులను అందుకున్న వారితో ఎమ్మెల్యే విజయశ్రీ, టీడీపీ నాయకులు సుధాకర్‌రెడ్డి, రమేష్, పెరుమాల్, మాధవ నాయుడు తదితరులు

సూళ్లూరుపేట, మార్చి 9(ఆంధ్రజ్యోతి): పేదలకు ఆరోగ్య రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకొంటుందని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. నియోజకవర్గంలోని 19 మందికి సీఎం సహాయనిధి కింద మంజూరైన రూ.24 లక్షల చెక్కులను ఎమ్మెల్యే ఆదివారం తన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్య చేయించుకొన్న వారికి కూడా సీఎం సహాయ నిధి కింద సాయం అందించేందుకు ప్రత్యేక చొరవ తీసుకొంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు పచ్చవ మాధవ నాయుడు, చిట్టేటి పెరుమాల్, కామిరెడ్డి మురళీ రెడ్డి, బొమ్మన్ పళణి, విజయ నాయుడు, శ్రీనివాసులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

వెంకటగిరి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి నియోజకవర్గంలోని 55 మందికి సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను రూ.60 లక్షల చెక్కులను ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆదివారం అందజేశారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ పులికొల్లు రాజేశ్వరరావు, తెలుగుయువత రాష్ట్ర కార్యదర్శి కేవీకే ప్రసాద్ నాయుడు, నాయకులు కాపా శ్రీనివాసులు, ఊటుకూరు దశయ్య, తిరుపాల్ రెడ్డి, వెంకటేశ్వర్లు, జగదల నాయుడు, సోమయ్య, మోహన్‌కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మహిళల సమస్యలను పరిష్కరించాలి



ముగ్గుల పోటీలను తిలకిస్తున్న ఐద్వా అధ్యక్షురాలు చంద్రకళ

నాయుడుపేట, మార్చి 9(ఆంధ్రజ్యోతి): అన్ని రంగాల్లో మహిళల సమస్యలను తెలుసుకొని పరిష్కరించాలని మహిళా సంఘం(ఐద్వా) అధ్యక్షురాలు చంద్రకళ అన్నారు. నాయుడుపేట పట్టణంలోని భూపయ్య కాలనీలో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం మణెమ్మ, రజక సంఘం నాయకులు పుట్టయ్య, వెంకటేశ్వర్లు, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

జనసేన ఆవిర్భావ దినోత్సవ పోస్టరు విడుదల



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జంపాల ప్రకాష్ తదితరులు

డక్కిలి, మార్చి 9(ఆంధ్రజ్యోతి): జనసేన ఆవిర్భావ దినోత్సవ పోస్టరును ఆ పార్టీ వెంకటగిరి ఇన్‌చార్జి జంపాల ప్రకాష్ ఆధ్వర్యంలో ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఈనెల 14న పిఠాపురంలో జరిగే జనసేన ఆవిర్భావ దినోత్సవ సభకు వెంకటగిరి నియోజకవర్గం నుంచి భారీగా జనసమీకరణ చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో జనసే జిల్లా కార్యదర్శి చామండి రాధమ్మ, నాయకులు చిరంజీవులు, నలుబోలు సాయి, బిక్కి చిరంజీవులు బాబు, శేట్టిపల్లి సుధీర్, చిన్నా, సుధ, పన్నీర్, రాజమోహన్, సర్దార్, శ్రీను, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ కింద పడి టీటీడీ కార్మికుడి మృతి

తిరుమల, మార్చి9(ఆంధ్రజ్యోతి): తిరుమలలో జరిగిన ట్రాక్టర్ ప్రమాదంలో ఓ కార్మికుడు తీవ్రంగా పడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. తిరుపతికి చెందిన యానాదయ్య(59) టీటీడీ అటవీ విభాగంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. ఆదివారం ఉదయం ట్రాక్టర్‌లో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తూ ఒక్కసారిగా కిందపడ్డారు. టాక్టర్ వెనుక చక్రాలు అతని కాళ్లపై ఎక్కడంతో తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే అశ్విని ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం వైద్యులు స్విమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ అతడు సాయంత్రం మృతి చెందారు.

అమ్మవారి సేవలో కేంద్రమంత్రి ఎస్పీసింగ్ బఘేల్

తిరుచానూరు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులో కొలువైన పద్మావతి అమ్మవారిని ఆదివారం కేంద్రమంత్రి ఎస్పీ సింగ్ బఘేల్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయం వద్ద టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. మొదట ధ్వజస్తంభానికి, అనంతరం సన్నిధిలో అమ్మవారి మూలవర్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.



ఆలయం వద్ద కేంద్రమంత్రి ఎస్పీసింగ్ బఘేల్

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

బైక్‌ను ఢీకొన్న లారీ
యువకుడి దుర్మరణం



అంకయ్య (ఫైల్‌ఫొటో)

చిట్టమూరు, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గున్నాగుంట రోడ్డు మలుపు వద్ద ఆదివారం సాయంత్రం మోటర్ బైక్‌ను లారీ ఢీకొన్న ప్రమాదంలో బందిల అంకయ్య(22) దుర్మరణం చెందాడు. పోలీసుల కథనం మేరకు... వాకాడు మండలం గొల్లపాళెం గ్రామానికి చెందిన కిష్టయ్య, శ్యామల దంపతుల కుమారుడు అంకయ్య నాయుడుపేట నుంచి మోటర్ బైక్‌పై ఇంటికి వెళ్తుండగా లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో అంకయ్య తల పగిలిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. అంకయ్య మోటర్ బైక్ వెనుక వస్తున్న ఆటోను కూడా లారీ ఢీకొట్టబోగా డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పింది. ఆటోలో ప్రయాణిస్తున్న 8 మందికి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఏఎస్ఐ నాగేశ్వరరావు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అంకయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీని స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్ పరారయ్యాడని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

నేడు పలు రైళ్ల రద్దు

తడ, మార్చి 9 (ఆంధ్రజోతి): తమిళనాడు రాష్ట్రం కవరేపేట - పొన్నేరు మధ్య పట్టాల మార్పిడి పనులు జరుగుతున్న నేపథ్యంలో సోమవారం పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు సదరన్ రైల్వే అధికారులు ప్రకటించారు. గత నెల రోజులుగా కవరేపేట - పొన్నేరు మధ్య ఇంజనీరింగ్ పనులు జరుగుతుండడంతో పలు మార్లు రైళ్ల రాకపోకలను నిలివేసిన విషయం తెలిసిందే. ఈక్రమంలో సోమవారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పనులు చేపట్టాలని సదరన్ రైల్వే అధికారులు నిర్ణయించారు. దీంతో సూళ్లూరుపేట - చెన్నై మధ్య నడిచే పలు సబర్బన్ రైళ్లు రద్దు చేయగా, మరికొన్ని రైళ్లు పొన్నేరు వరకు నడిపి తిప్పి పంపనున్నారు. అలాగే సూళ్లూరుపేట నుంచి నెల్లూరుకు మధ్యాహ్నం 3.50 నిమిషాలకు బయలుదేరి వెళ్లే మెమూ రైలు, నెల్లూరు నుంచి సూళ్లరుపేటకు సాయంత్రం 6.45 నిమిషాలకు బయలుదేరి వచ్చే మెమూ రైలును పూర్తిగా రద్దు చేశారు.

తెలుగంగ కాలువలో మృతదేహం

బాలాయపల్లి, మార్చి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని కామకూరు సమీపంలోని తెలుగంగ కాలువలో గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు ఆదివారం గుర్తించి పోలీసులకు సమాచారం అదించారు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడి వయస్సు 45 సంవత్సరాలు ఉండవచ్చని, బులుగురంగు చొక్కా, నలుపురంగు ప్యాంటు ధరించి ఉన్నాడని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వెంకటగిరి ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కల్వర్టుకు మరమ్మతులు చేయండి



కల్వర్టు మధ్యలో ప్రమాదకరంగా ఉన్న గొయ్యి

గూడూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక నాయుడుకాలువకట్ట ప్రాంతంలో కల్వర్టు ధ్వంసమైంది. కల్వర్టుకు మధ్యలో పెద్ద గొయ్యి ఏర్పడడంతో వీధిలోకి రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు చెబుతున్నారు. రాత్రి సమయంలో గొయ్యి కనిపించక వాహనదారులు, పాదచారులు ప్రమాదాలకు లోనవుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి కల్వర్టుకు మరమ్మతులు చేసి ప్రమాదాలను నివారించాలని కోరుతున్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ



పేదలకు దుస్తులను పంపిణీ చేస్తున్న ట్రస్ట్ సభ్యులు

గూడూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెద్దచర్చి సమీపంలో ఆదివారం మహ్మద్ ఫక్రుద్దీన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు దుస్తులను పంపిణీ చేశారు. ట్రస్ట్ అధ్యక్షుడు మగ్దూం, అన్వర్, రెహమాన్, కరిముల్లా, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

జీఎస్‌టీ ఆఫీసు సబార్డినేట్ రాష్ట్ర నూతన కార్యవర్గం ఎన్నిక





శ్రీనివాసరావు, చెన్నకేశవులు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సేల్స్ ట్యాక్స్ ఆఫీసు సబార్డినేట్ల సంఘం (జీఎస్‌టీ) రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని తిరుపతి జీఎస్‌టీ కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు ఇటీవల రాష్ట్ర అధ్యక్ష పదవికి గోపాలకృష్ణ రాజీనామా చేయడంతో ఆయన స్థానంలో నూతనంగా ఆర్. శ్రీనివాసరావును(విజయవాడ) కమిటీ సభ్యులు ఎన్నుకున్నారు. వీరితో పాటు చెన్నకేశవులు(గుంటూరు) ప్రధాన కార్యదర్శిగా, ఆర్.సత్యనారాయణను కార్యాలయ కార్యదర్శిగా, జగన్నాధంను కోశాధికారిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితో పాటు మొత్తం 11 మంది సభ్యులను ఎన్నుకున్నారు. ఈ క్రమంలో ముందుగా నూతన కమిటీ కోసం ఎన్నికలు నిర్వహించాలని భావించినా ఆఖరి నిమిషంలో సభ్యులందరూ కలసి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రభుత్వం నుంచి ఆఫీసు సబార్డినేట్ సిబ్బందికి రావాల్సిన సౌకర్యాలు, ఇతర ప్రయోజనాలపై ప్రభుత్వంతో చర్చించి న్యాయమైన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 13 ఉమ్మడి జిల్లాల నుంచి దాదాపు 100 మంది సభ్యులు పాల్గొన్నారు.

చెలరేగుతున్న మట్టి మాఫియా

మంగళంపాడు చెరువులో అక్రమ తవ్వకాలు

సూళ్లూరుపేట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మట్టి మాఫియా మళ్లీ చెలరేగిపోతోంది. ఎలాంటి అనుమతులూ లేకుండా చెరువులను సైతం తవ్వేస్తున్నారు. మంగళంపాడు చెరువులో శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం తెల్లవారుజామున వరకు ఎక్స్‌కవేటర్ల ద్వారా మట్టిని తవ్వి టిప్పర్ల ద్వారా సూళ్లూరుపేటలో పలు వెంచర్లకు తరలించారు. ఇప్పటికే పది అడుగులకు పైగా లోతు తవ్వేశారు. ఈ చెరువులో దొరికే మట్టి, గ్రావెల్ నాణ్యతగా ఉండడంతో టిప్పర్ రూ.13 వేల నుంచి 15వేల వరకు, ఒక ట్రాక్టర్ ట్రక్కు రూ.వెయ్యి వరకు పలుకుతోంది. ఈ అ క్రమ దందాలో వైసీపీ నేతలే ప్రధాన పాత్ర పోషిస్తున్నట్లు తెలుస్తోంది. దీనికి అధికారుల సహకారం కూడా ఉందన్న ఆరోపణలున్నాయి. ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరముంది.



మంగళంపాడు చెరువులో తవ్వేయడంతో ఏర్పడిన గుంతలు

సీజేఎఫ్ఎస్ భూములకు పట్టాలివ్వండి



జయంపులో సీజేఎఫ్ఎస్ భూముల్లో నిమ్మ సాగు

బాలాయపల్లి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీజేఎఫ్ఎస్ భూములకు పట్టాలివ్వాలని సాగుదారులు కోరుతున్నారు. మండలంలోని అంబలపూడి, ఆరిగేపల్లి, చిలమనూరు, చుట్టి, గొల్లగుంట, జయంపు. నిడిగల్లు, పెరిమిడి, సుబ్రమణ్యం, ఊట్లపల్లి, కడగుంట గ్రామాల్లో రైతులు కోఆపరేటివ్ జాయింట్ పార్మింగ్ సొసైటీ ఆధ్వర్యంలో భూములను సాగు చేసుకునేవారు. అయితే సదరు భూములపై సాగుదారులకు ఎటువంటి హక్కులు లేకపోవడంతో ఎలాంటి రుణాలు పొందలేని పరిస్థితి. మరికొందరు అప్పులు చేసి పంటలు సాగు చేస్తుండగా, కొందరు పెట్టుబడి ఖర్చులకు డబ్బులు లేక భూములను బీడుగా వదిలేశారు. కుంటున్నారు. ఈ నేపథ్యంలో రైతుల విజ్ఞప్తి సదరు భూములపై హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసింది. ఇందులో భాగంగా 2018లో సీజేఎఫ్ఎస్‌లను రద్దు చేసి అసైన్డ్ మెంట్ పట్టాలు మంజూరు చేసేందుకు శ్రీకారం చుట్టింది. అయితే సీజేఎఫ్ఎస్ భూములు రికార్డుల్లో అడవిగా నమోదై ఉండడం, అదే సమయంలో ఎన్నికలు రావడంలో పట్టాల మంజూరు ప్రక్రియ నిలిచిపోయింది. తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం స్పందించి సీజేఎఫ్ఎస్ భూములకు పట్టాలివ్వాలని సాగుదారులు కోరుతున్నారు.

శేష వాహనంపై వేణుగోపాల స్వామి



సూళ్లూరుపేట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మంగళంపాడులోని సౌందర్యవల్లీ రుక్మిణీ సత్యభామా గోదా సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో బ్రహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి ఆదివారం స్వామివారు చిన్నశేష వాహనంపై ఊరేగారు. రాత్రి హంస వాహనంలో కొలువుదీరారు. ఉదయం ఆలయంలో శెల్వస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి స్వామివారిని పుష్పాలతో అలంకరించారు. ఉభయకర్తలుగా రాజా మొదలి, వెంకటేష్ మొదలి కుటుంబసభ్యులు వ్యవహరించారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకొన్నారు.

కోటమ్మకు పూజలు



కోట, మార్చి 9(ఆంధ్రజ్యోతి): కోట గ్రామదేవత కోటమ్మకు ఆదివారం విశేష పూజలు జరిగాయి. పండితులు అమ్మవారికి పలు అభిషేకాలు చేసి చందన పుష్పాలంకరణలో ఉంచారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ముత్యాలమ్మకు పూజలు



చిల్లకూరు, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు కనుపూరు గ్రామంలో వెలసిన ముత్యామ్మకు ఆదివారం పూజలు జరిగాయి. భక్తులు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా నివేదించారు. ప్రత్యేక అలంకారంలో ఉన్న ముత్యాలమ్మను దర్శించుకున్నారు. ఆలయం ఎదుట ఉన్న త్రిశూలం వద్ద టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

మద్యం షాపును తరలించండి



ఎమ్మెల్యే విజయశ్రీకి సమస్య వివరిస్తున్న మహిళలు

సూళ్లూరుపేట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): తడ పంచాయతీలోని తడ దళితవాడ ప్రాంతంలో ఐఎంసీ పరిశ్రమకు వెళ్లే మార్గంలో ఉన్న మద్యం షాపును అక్కడి నుంచి తరలించేలా చూడాలని స్థానిక మహిళలు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీకి మొరపెట్టుకున్నారు. అక్కడ మద్యం షాపు ఉండడం వల్ల ఆ మార్గంలో కంపెనీలకు వెళ్లే మహిళల పట్ల తాగుబోతులు అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఎమ్మెల్యే స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి మద్యం షాపును తరలించేలా చూస్తామన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ



నందగోపాల్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న నరేంద్రరెడ్డి

పెళ్లకూరు, మార్చి 9 (ఆంధ్రజోతి): మండలంలోని అక్కగారిపేటకు చెందిన ఇలుపూరు నందగోపాల్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆయన చిత్రపటానికి బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దల నరేంద్రరెడ్డి ఆదివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. నందగోపాల్ తండ్రి గోవర్ధన్, సోదరుడు నానిజితేంద్రను పరామర్శించారు. నరేంద్రరెడ్డి వెంట బీజేపీ మండల అధ్యక్షుడు కలిచేటి నరసింహులు, గోగుతోటి మురళీ తదితరులు ఉన్నారు.

శ్రీవారి సర్వదర్శనానికి 15 గంటలు

తిరుమల, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): వేంకటేశ్వరస్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరి షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు. శుక్రవారం హుండీ ఆదాయం రూ.3.52 కోట్లు లభించింది. శనివారం శ్రీవారిని 74,646 మంది దర్శించుకున్నారు.

అరుంధతీయపాలెంలో కార్డన్ సెర్చ్



పోలీసు సిబ్బందికి సూచనలిస్తున్న సీఐ శేఖర్‌బాబు

గూడూరు అర్బన్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక అరుంధతీయపాళెంలో ఆదివారం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సరైన ధృవీకరణ పత్రాలు లేని 13 బైక్‌లను గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ శేఖర్‌బాబు మాట్లాడుతూ నేరాలను నియంత్రించేందుకు, గంజాయి అక్రమ రవాణాను అరికట్టేందుకు కార్డన్ సెర్చ్ నిర్వహించామన్నారు. ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కల్పించేలా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొత్త వ్యక్తులు సంచరిస్తుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ తిరుపతయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

పెన్నక్క చెరువుకు గంగ జలాలు



స్వర్ణముఖి నది నుంచి పెన్నక్క చెరువుకు వెళుతున్న గంగ జలాలు

కోట, మార్చి 9(ఆంధ్రజ్యోతి): కోట మండలంలోని గూడలి స్వర్ణముఖినది నుంచి నెల్లూరు పల్లి కొత్తపాలెం వద్ద ఉన్న పెన్నక్క చెరువుకు తెలుగు గంగ జాలలు వెళుతున్నాయి. ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ చొరవతో కండలేరు నుంచి 240 క్యూసెక్కుల గంగ జలాలను 7వ బ్రాంచ్ కెనాల్ ద్వారా పెన్నక్క చెరువులోకి మళ్లించారు. దీంతో చెరువు కింద ఉన్న 8500 ఎకరాల ఆయకట్టు భూముల్లో ఈఏడాది ఎడగారు వరిసాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు.

ఉపాధి పనులతో పంట కాలువలు బాగు



పంట కాలువలను శుభ్రం చేస్తున్న కూలీలు

పెళ్లకూరు, మార్చి 9 (ఆంధ్రజోతి): ఉపాధి పనులతో సాగునీటి చెరువులకు నీరందించే పంట కాలువలు, వాగులు, వంకలకు మోక్షం కలుగుతున్నాయి. మండలంలో తెలుగుగంగ, స్వర్ణముఖినది నుంచి సాగునీటి చెరువులకు, కుంటలకు నీరందించే పంట కాలువలు పిచ్చి మొక్కలు, చెత్తాచెదారాలతో నిండిపోయి పూడుకుపోయాయి. ఉపాధి పథకం కింద చెరువుల గట్లు, పంట కాలువలు, వాగుల్లో చెత్తా చెదారాలను తొలగించడంతో పాటు పూడికతీత పనులను చేపట్టారు.

తిరుచ్చిపై సీతారామలక్ష్మణ సమేత హనుమంతు



చంద్రగిరి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం తిరుచ్చి వాహనంపై సీతారామలక్ష్మణ సమేత హనుమంతు ఉత్సవర్లు భక్తులకు దర్శనమిచ్చారు. నిత్యకట్ల కైంకర్యాలు పూర్తయ్యాక పునర్వసు నక్షత్రం సందర్భంగా సాయంత్రం కన్నుల పండువగా ఉత్సవర్లకు ఊంజల్ సేవ నిర్వహించారు. అనంతరం విశేషంగా అలంకరించి, తిరుచ్చి వాహనంపై అధిష్ఠింపజేసి మాడ వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు రాజ్‌కుమార్, రమేష్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, అర్చకులు బాలాజిరంగాచార్యులు, శేషాద్రిచార్యులు, నారాయణాచార్యులు, పార్థసారథి, జమేధర్ చిరంజీవి, భక్తులు సిబ్బంది పాల్గొన్నారు. చంద్రగిరిలోని కోదండరామాలయంలో సీతారామలక్ష్మణ సమేత హనుమ ఉత్సవర్లకు ఆగమ శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈవో పార్థసారథి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గోపాలకృష్ణయ్య, అర్చకులు శ్రీనివాసబట్టర్, నరసింహన్, సిబ్బంది పాల్గొన్నారు.

తిరుమలలో అనధికార వ్యక్తుల విచారణ

తిరుమల, మార్చి9 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతులు, ఆధారాలు లేకుండా తిరుమలలో తిష్ట వేసిన అనధికార వ్యక్తులను ఆదివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నేరాల నియంత్రణ, విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు తిరుమలలో పోలీసులు, విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. 25 మంది ఎలాంటి సర్టిఫికెట్స్ లేకుండా వ్యాపారాలు చేస్తున్నట్టు గుర్తించారు. వారికి నేరచరిత్ర, ఆధారాలు లేకపోవడంతో తిరుపతికి పంపారు.